# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

31.01.2026 శనివారం Saturday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 203 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



## రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789




# వనదేవతల వైభవం

- మేడారంలో భక్తి పారవశ్యం
- క్యూ కట్టిన కోట్లాది భక్తజనం..
- తరలివచ్చిన గవర్నర్, మంత్రులు!



మేడారం మహా జాతర భక్తి పారవశ్యంతో అట్టహాసంగా కొనసాగుతోంది. “వన దేవత.. మన దేవత.. జన దేవత“ అంటూ అపార విశ్వాసంతో దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు మేడారానికి తరలివస్తుండటంతో జాతర ప్రాంగణం కిక్కిరిసిపోయింది. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పించి పూజలు నిర్వహించగా, డీజీపీ శివధర్ రెడ్డి, తదితరులు తల్లులను దర్శించుకున్నారు.

.. వివరాలు 3లో

# దానం అనర్హతపై స్పీకర్ విచారణ

- కౌశిక్ రెడ్డి పిటిషన్ ఆధారంగా క్రాస్ ఎగ్జామిన్
- సమయం కోరిన బిజెపి నేత మహేశ్వరరెడ్డి
- 18న విచారణకు హాజరు కావాలని గడువు





పార్టీ ఫిరాయింపు కేసులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ పూర్తయ్యింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి వేసిన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ చేపట్టారు. 2



# హార్వర్డ్ వర్సిటీలో సీఎం శిక్షణ

వారం రోజుల సర్టిఫికెట్ కోర్సు పూర్తి



# టెట్ ‘కీ’ విడుదల 3లో



4

# బంగారం.. తిరోగమనం

భారీగా తగ్గిన ధరలు..

## ఐపీఎస్ అధికారిపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు

- క్షమాపణలు చెప్పాలని అధికారుల సంఘం డిమాండ్
- బేషరతుగా క్షమాపణలు చెప్పిన కౌశిక్ రెడ్డి

3

## పెళ్లి పేరుతో అవమానాలు వేధింపులు

తట్టుకోలేక మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



ఇద్దరు యువకులు వేధించడం, అవమానించడం తట్టుకోలేక ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకుంది. 2లో



## తెలంగాణ నీటి ప్రయోజనాలను

# వదులుకోం

**పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు పై చర్చే లేదు**

హరీష్‌రావు నిజాలు తెలుసుకుని మాట్లాడాలి

పదేళ్లలో సాగునీటి రంగాన్ని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్

మండిపడ్డ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

“కేంద్ర జలసంఘం ఛైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు అంశాన్ని అధికారులు పూర్తిగా వ్యతిరేకించినట్టు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నదీ జలాల్లో తెలంగాణ ప్రయోజనాలు పరిరక్షించేలా అవసరమైన వాదనలను అధికారులు వినిపించారని చెప్పారు.”

**హైదరాబాద్, జనవరి 30:** పోలవరం – బనకచర్ల లేదా నల్లమలసాగర్‌కు ఎలాంటి అనుమతులు ఇవ్వ లేదని శుక్రవారం నాటి సమావేశంలో సీడబ్ల్యూసీ ఛైర్మన్ స్పష్టంగా చెప్పారన్న మంత్రి... గతంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కూడా లిఖితపూర్వకంగా తెలిపారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో తెలంగాణకు నీటి వాటాల్లో నష్టం జరిగిందని ఆరోపించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ ప్రభుత్వం చుక్క నీరు కూడా వదులుకోదని.. తెలంగాణ నీటి హక్కుల కోసం సర్వశక్తులు ఒడ్డుతూ పోరాడుతున్నట్లు వివరించారు. నీటి వాటాలపై చర్చలకు తాము సిద్ధమేనని

మిగతా 2 లో

## పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టును తొలగించాలి

కమిటీ ముందు తెలంగాణ డిమాండ్

జలశక్తి కమిటీ ముందు ముగిసిన భేటీ 2





2

# మరోమారు కేసీఆర్‌కు షాక్

ఫామ్‌హౌజ్ విచారణ కుదరదని స్పష్టీకరణ

**ఆదివారం నందినగర్‌లోని నివాసంలోనే విచారణకు సిద్ధంగా ఉండాలని నోటీసులు**

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ అధికారులు మరోసారి షాక్ ఇచ్చారు. తనను ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో విచారించాలన్న కేసీఆర్ అభ్యర్థనను తోసిపుచ్చిన అధికారులు, ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు హైదరాబాద్ నందినగర్‌లోని ఆయన నివాసంలోనే విచారణకు సిద్ధంగా ఉండాలని నోటీసులిచ్చారు.



# బాపూజీకి ఘన నివాళి

- మహాత్మాగాంధీ 78వ వర్ధంతి
- రాజ్‌ఘాట్ వద్ద రాష్ట్రపతి, ప్రధాని నివాళి
- నివాళి అర్పించిన చంద్రబాబు

వివరాలు 4వ పేజీలో



4

# రికార్డు చేసుకో.. మీ అక్కను చంపేస్తున్నా

బావమరిదికి ఫోన్ చేసి భార్యను చంపిన దుర్మార్గుడు

స్వాట్ కమాండో హత్య కేసులో దర్యాప్తు

# తెలంగాణ నీటి ప్రయోజనాలను వదులుకోం

మొదటి పేజీ తరువాయి

అన్నారు. ఢిల్లీ సమావేశం గురించి హరీశ్‌రావు తెలుసుకొని మాట్లాడితే బాగుండేదని ఉత్తమ్ సూచించారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేవలం 60, 70 టీఎంసీలను మాత్రమే వ్యవసాయానికి ఉపయోగించారని.. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదని విమర్శించారు. నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేసిన బీఆర్ఎస్ నేతలు తమను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఆక్షేపించారు. ఆదిత్యనాథ్ దాస్ గురించి పదేపదే మాట్లాడడం తగదన్న ఆయన... తెలంగాణ ప్రాజెక్టులపై పూర్తి అవగాహన ఉన్నందుకే ఆదిత్యనాథ్ దాస్‌ను ప్రభుత్వ సలహాదారుగా పెట్టుకున్నట్లు వివరించారు. కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ సమావేశం దాదాపు రెండు గంటల ఈ భేటీ సాగింది. ఈ అంశంపై తెలంగాణ ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి 12 అంశాలు చర్చించాలని ప్రతిపాదించామన్నారు. పోలవరం నల్లమల్ల సాగర్ ప్రాజెక్టును అజెండాలో



పెట్టొద్దని స్పష్టం చేసినట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య పలు జల వివాదాలు ఉన్నాయి.. కృష్ణా, గోదావరి జలాలపై అనేక అంశాలు ఉన్నాయి, అందుకే సమావేశానికి వచ్చామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఏపీ తన అజెండాను చెప్పలేదని.. తదుపరి సమావేశం సీడబ్ల్యూసీ నిర్ణయిస్తుందన్నారు. అనంతరం.. ఈ అంశంపై తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. 'ఒక్క చుక్క నీరు కూడా వదులుకోం. ఢిల్లీలో జరిగిన మీటింగ్ గురించి హరీష్ రావు తెలుసుకుని మాట్లాడాలి.. మన నది జలాలను కాపాడుకోవడానికి ఎవరితోనైనా చర్చలకు సిద్ధం.. కానీ చుక్క నీరు కూడా వదులుకునేది లేదు.. తెలంగాణ అధికారులు.. నల్లమల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టడానికి ఒప్పుకోమని స్పష్టం చేశారు.. ఇంటర్ స్టేట్ ఇష్యూలు అజెండాలో పెట్టాలని కేంద్రానికి చెప్పారు. పోలవరం.. నల్లమల సాగర్ కి అనుమతి లేదని కేంద్ర మంత్రి నాకు లేఖ రాశారు.. ఇవాళ జరిగిన మీటింగ్ లో కూడా సీడబ్ల్యూసీ ఇదే చెప్పింది.. పదేళ్లు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి కట్టిన ప్రాజెక్టు కూలింది.. ఆ నాయకులు సిగ్గుపడాలి.. పదేళ్లలో ఎస్ఎల్‌బిసి పూర్తి చేయలేదు.. డిండి ప్రాజెక్టు పూర్తి చేయలేదు.. పదే పదే అబద్దాలు చెప్పి? నిజం చేయాలని అనుకుంటున్నారు.. పదేళ్ల లో కంటే ఈ రెండేళ్లలో ఎక్కువ నీటి వినియోగం, వరి దిగుబడి వచ్చిందని ఉత్తమ్ వ్యాఖ్యానించారు.

# పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టును తొలగించాలి

**కమిటీ ముందు తెలంగాణ డిమాండ్**


**జలశక్తి కమిటీ ముందు ముగిసిన భేటీ**



**న్యూఢిల్లీ, జనవరి 30:** కేంద్ర జలవివాదాల పరిష్కార కమిటీ సమావేశం ముగిసింది. దాదాపు 2 గంటలపాటు భేటీ జరిగింది. అజెండాలో 12అంశాలు చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టవద్దని కోరింది. ట్రైబ్యునల్ తీర్పు వచ్చే వరకు 50శాతం వాడుకునే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. తెలంగాణ అధికారులు లేవనెత్తిన పలు అంశాలపై ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. వారంలోగా అజెండా అంశాలు ఖరారు చేసి లిఖితపూర్వకంగా ఇవ్వాలని సీడబ్ల్యూసీ ఛైర్మన్ తెలిపారు. అజెండా అంశాలు ఖరారయ్యాక భేటీ తేదీని ఖరారు చేస్తామని ఛైర్మన్ స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య నదీ జలాల నిర్వహణ, వినియోగం విషయంలో కొనసాగుతున్న వివాదాల పరిష్కారానికి కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేసిన కమిటీ తొలి సమావేశం శుక్రవారం ఢిల్లీలో ప్రారంభమైంది. సీడబ్ల్యూసీ ఛైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతోంది. కమిటీ తదుపరి చర్చల కోసం జల వివాదాలకు సంబంధించిన అజెండా అందజేయాలని కమిటీ సభ్యులను సీడబ్ల్యూసీ ఛైర్మన్ కోరారు. ఈ సమావేశానికి ఏపీ, తెలంగాణ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, జలవనరుల శాఖ సలహాదారులు, ఇంజనీర్ ఇన్- చీఫ్‌లు, జలవనరుల శాఖ అధికారులు, కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ ఛైర్మన్లు, ఎన్‌డబ్ల్యూడీఏ చీఫ్ ఇంజనీర్ హాజరయ్యారు. ఏపీ నుంచి జలవనరుల శాఖ అడ్వైజర్- వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి పలువురు అధికారులు హాజరయ్యారు. అలాగే తెలంగాణ నుంచి ఆదిత్యనాథ్, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్, కేంద్ర రాష్ట్ర సమన్వయ అధికారి గౌరవ్ ఉప్పల్ హాజరయ్యారు.

# మరోమారు కేసీఆర్‌కు సిట్ షాక్

- ఫామ్‌హౌజ్ విచారణ కుదరదని స్పష్టీకరణ
- నందినగర్ ఇంట్లోనే విచారిస్తామని వెల్లడి
- ఆదివారం 3గంటలకు విచారణకు సిద్దంగా ఉండాలని నోటీస్
- న్యాయనిపుణులతో చర్చించి నోటీసులు




**హైదరాబాద్, జనవరి 30:** ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బిగ్ షాక్ తగిలింది. సిట్ అధికారులు శుక్రవారం మరోసారి ఆయనకు నోటీసులు ఇచ్చారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే కేసీఆర్‌ను విచారించాలని నిర్ణయించారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు అందుబాటులో ఉండాలని తెలిపారు. కాగా, నిన్న (గురువారం) సిట్ అధికారులు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి సిట్ అధికారులు వెళ్లి నోటీసులు అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు అందుబాటు లో ఉండాలని నోటీసులో స్పష్టం చేశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న కేసీఆర్ అభ్యర్థనను సిట్ తిరస్కరించింది. హైదరాబాద్ నందినగర్లోని నివాసంలో అందుబాటులో ఉండాలని కేసీఆర్‌కు సూచించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని జనవరి 29న 160 సీఆర్ పీసీ కింద సిట్ నోటీసులు జారీ చేసింది. కేసీఆర్ ఫామ్ హౌస్ లో ఉండగా..బంజారాహిల్స్‌లోని నందినగర్‌లో ఆయన నివాసంలో అధికారులు నోటీసులు అందించారు. జనవరి 30న మధ్యాహ్నం 3గంటలకు విచారణకు హాజరుకావాలని తెలిపారు. అయితే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విచారణకు హాజరుకాలేనని సిట్ అధికారులకు కేసీఆర్ లేఖ రాశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలని అధికారులకు సూచించారు. అలాగే భవిష్యత్‌లోనే ఎలాంటి నోటీసులైనా.. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్ అడ్రస్‌కే పంపాలని విన్నవించారు. అయితే కేసీఆర్ వినతిపై న్యాయనిపుణులతో చర్చించిన సిట్ ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. అలాగే ఫిబ్రవరి 1న మధ్యాహ్నం 3గంటలకు బంజారాహిల్స్ నందినగర్లోని కేసీఆర్ నివాసంలో విచారిస్తామని నోటీసు జారీ చేసింది. శుక్రవారం మున్సిపల్ ఎన్నికల కారణంగా విచారణను వాయిదా వేయాలని కోరారు. మరో రోజు విచారణకు పిలిస్తే తప్పకుండా హాజరవుతానని, విచారణ కోసం వేరే తేదీ నిర్ణయించాలని సిట్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌ను ఎక్కడ విచారించాలనే దానిపై సిట్ అధికారులు ఈ రోజు సమావేశం నిర్వహించి, న్యాయ నిపుణులతో చర్చించారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే విచారించాలని నిర్ణయించారు.

# దానం అనర్హతపై స్పీకర్ విచారణ

**కౌశిక్ రెడ్డి పిటిషన్ ఆధారంగా క్రాస్ ఎగ్జామిన్**

**సమయం కోరిన బిజెపి నేత మహేశ్వరెడ్డి**

**18న విచారణకు హాజరు కావాలని గడువు**



**హైదరాబాద్,జనవరి 30:** పార్టీ ఫిరాయింపు కేసులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ పూర్తయ్యింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి వేసిన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ చేపట్టారు. దానంపై అనర్హత వేటు వేయాలని పాడి కౌశిక్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి పిటిషన్‌లు దాఖలు చేశారు. ముందుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. దానం తరపున న్యాయవాదులు కౌశిక్ రెడ్డిని క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. దానంపై పిటిషన్ ఎందుకు వేశారు?.. పార్టీ మారారని చెప్పేందుకు గల ఆధారాలపై పాడి కౌశిక్‌ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తన వద్ద ఉన్న ఆధారాలను స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అందజేశారు. బీఆర్ఎస్ నుంచి దానం పోటీ చేసి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందడం, ఆ తరువాత కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేయడం, దానం ప్రచార ఫొటోలు, వీడియోలు.. దానం కాంగ్రెస్ కండువా వేసుకున్న ఫొటోలను స్పీకర్ ముందు ఉంచారు పాడి కౌశిక్ రెడ్డి. దీంతో స్పీకర్ ఎదుట పాడి కౌశిక్ రెడ్డి విచారణ ముగిసింది. ఇక, దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై సాక్ష్యాలను అఫిడవిట్ రూపంలో దాఖలు చేశారు బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి. మహేశ్వర్ రెడ్డి తరఫు న్యాయవాదులు.. స్పీకర్ ముందు హాజరయ్యారు. దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించేందుకు ఎవిడెన్స్ అఫిడవిట్‌ను పొందుపరిచానని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాను వ్యక్తిగతంగా హాజరుకాలేనని ఆయన తెలిపారు. వ్యక్తిగతంగా హాజరు కావాలంటే సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 20 తరువాత సమయం ఇస్తే తాను విచారణకు వ్యక్తిగతంగా హాజరవుతానని అఫిడవిట్‌లో మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. దీంతో బీజేపీ పిటిషన్‌పై ఫిబ్రవరి 18న స్పీకర్ విచారించనున్నారు. ఇక, పార్టీ ఫిరాయింపుల కేసు కీలక దశకు చేరుకుంది. ఇప్పటివరకూ పది మంది ఎమ్మెల్యేలపై ఆరోపణలు రాగా.. ఎనిమిది మందికి సంబంధించిన విచారణ పూర్తి అయ్యింది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి విచారణ జరగాల్సి ఉండగా... దానంను స్పీకర్ విచారించారు. దానం చెప్పే విషయాలను స్పీకర్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. గతంలో ఎనిమిది మంది ఎమ్మెల్యేల విచారణ సమయంలోనూ ఇదే జరిగింది. విచారణ సమయంలో ఏ పార్టీలో ఉన్నారనే విషయాన్ని ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలను స్పీకర్ ప్రశ్నించగా.. వారంతా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని సమాధానం ఇచ్చారు. ఇక దానం నాగేందర్ కూడా మొన్నటి వరకు తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, అవసరమైతే ఉపఎన్నికకు వెళ్లేందుకు సిద్ధమని ప్రకటించారు. అయితే గత రెండ్రోజులుగా దానం యూటర్న్ తీసుకున్న పరిస్థితి. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, పార్టీకి ఇంకా రాజీనామా చేయలేదని చెప్పుకొచ్చారు. స్పీకర్ తనపై అనర్హత వేటు వేస్తే.. ఉప ఎన్నికకు సిద్ధమని దానం పదేపదే చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.




# హార్వర్డ్ వర్సిటీలో సీఎం శిక్షణ

**వారం రోజుల సర్టిఫికెట్ కోర్సు పూర్తి**

**హైదరాబాద్, జనవరి 30:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలో ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీలోని కెన్నెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లోఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. లీడర్ షిప్ అనే కోర్సును పూర్తిచేసి సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని పొందారు. జనవరి 25న ఈ కోర్సు ప్రారంభమవగా జనవరి 30 వరకు అంటే వారం రోజుల పాటు నిర్వహించారు. ఈ కోర్సులో సీఎం రేవంత్‌తో పాటు 62మంది కోహోర్ట్ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. దాదాపు 20కి పైగా దేశాల నుంచి ప్రతినిధులు ఇందులో భాగస్వాములయ్యారు. అమెరికాలోని కేంబ్రిడ్జ్‌లో మైనస్ 24 డిగ్రీల తీవ్ర చలిలోనూ రేవంత్ రెడ్డి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులకు హాజరయ్యారు. కేస్ స్టడీలు, గ్రూప్ డిస్కషన్లు, కన్సల్టేటివ్ వర్క్‌లతో కూడిన ఇంటెన్సివ్ ప్రోగ్రామ్‌లో భాగంగా అధికారం, నాయకత్వం, సంఘర్షణలు, అనిశ్చితి వంటి అంశాలపై శిక్షణ పొందారు. ప్రోగ్రామ్ ముగిసిన సందర్భంగా హార్వర్డ్ అధ్యాపకులు రేవంత్ రెడ్డితో పాటు మిగిలిన 62 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అయితే భారతదేశ చరిత్రలో అధికారంలో ఉండగానే హార్వర్డ్ నుంచి ఈ రకమైన సర్టిఫికెట్ పొందిన తొలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి రికార్డ్ సృష్టించారు.

# ఎడ్‌సెట్‌కు టీ-సాట్ బూస్ట్

**ప్రసారాల షెడ్యూల్ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు**




**హైదరాబాద్, జనవరి 30:** టీఉసాట్ నెట్‌వర్క్ ఛానళ్ల ద్వారా ప్రసారం కానున్న ఎడ్‌సెట్ కోచింగ్ షెడ్యూల్ పోస్టర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సచివాలయంలో ఆవిష్కరించారు. టీఉసాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డితో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎడ్‌సెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించేందుకు టిఉసాట్ అందించే డిజిటల్ కంటెంట్‌ను బీఈడీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం విద్యకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఫిబ్రవరి 2 నుంచి మే 11 వరకు రోజుకు నాలుగు గంటల పాటు 392 ఎపిసోడ్స్ ప్రసారం చేయనున్నట్లు వెల్లడించారు. బయాలజీ, ఫిజికల్ సైన్స్, మాథమేటిక్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్, తెలుగు సబ్జెక్టులతో 98 రోజుల పాటు టిఉసాట్ విద్య, నిపుణ ఛానళ్లతో పాటు టిఉసాట్ యాప్, యూట్యూబ్‌లో కూడా ప్రసారాలు కొనసాగుతాయని తెలిపారు. పోటీ పరీక్షలకు డిజిటల్ కంటెంట్ అందిస్తున్నందుకు టిఉసాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డిని మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఉసాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎండీ సాధిక్ పాల్గొన్నారు.

# పెళ్లి పేరుతో వేధింపులు.. అవమానాలు

**తట్టుకోలేక మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య**




**వరంగల్, జనవరి 30:** ఇద్దరు యువకులు వేధించడం, అవమానించడం తట్టుకోలేక ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సీత్యతండాకు చెందిన అనిత.. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. అనితను తొర్రూరు మండలానికి చెందిన దూరపు బంధువు రాజేందర్ పెళ్లి చేసుకుంటానని నాలుగేళ్లుగా చెబుతూ వస్తున్నాడు. ఇటీవల అనిత డ్యూటీలో ఉండగా వీడియో కాల్ చేయమని చెప్పడం, ఎవరితోనో మాట్లాడుతున్నావంటూ రాజేందర్ ఆమెను వేధించడం మొదలుపెట్టాడు. అతని వేధింపులు తట్టుకోలేక అనిత తన తల్లిదండ్రులతో చెప్పి బాధపడింది. రాజేందర్ పద్ధతి నచ్చక, తమ కూతురుని అతడికి ఇచ్చి పెళ్లి చేయడం కుదరదని తేల్చి చెప్పారు. అయినా అనితను పెళ్లి చేసుకుంటానంటూ బతిమలాడుతూనే ఉన్నాడు. మరోవైపు అనిత తన క్లాస్‌మేట్ అయిన జబ్బార్ లాల్‌ని ప్రేమించడం మొదలుపెట్టింది. ఇద్దరూ పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుందామని భావించారు. ఇటీవల జబ్బార్ కూడా మోసగాడని తేలింది. పెళ్లి చేసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలని పదేపదే వేధించడం మొదలు పెట్టాడు. జబ్బార్ వేధింపులు తట్టుకోలేక మనస్తాపానికి గురైన అనిత ఈ నెల 27న రాజేందర్‌కు ఫోన్ చేసి 'నువ్వు, జబ్బార్ నా జీవితంతో ఆడుకున్నారు, నన్ను వేధించారు, అవమానించారు, మీ వల్లనే నేను ఆత్మహత్య చేసుకుంటున్నా' అంటూ బాధపడింది. అనితకు ధైర్యం చెప్పాల్సిన రాజేందర్ నిర్లక్ష్యంగా 'చావు.. నీ ఇష్టం' అంటూ ఫోన్ కట్ చేశాడు. దాంతో అనిత తీవ్ర మనస్తాపానికి గురై గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. అది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ అనిత కన్నుమూసింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రాజేందర్, జబ్బార్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# తెలంగాణ ప్రాజెక్టులకు పాతర

- చంద్రబాబుతో దోస్తీతో ఏపీకి లైన్ క్లియర్
- నల్లమల సాగర్ ప్రాజెక్ట్ కోసం నాటకాలుడుతున్న రేవంత్
- ఇరిగేషన్ మీటింగ్ బాయ్‌కాట్ చేయడం ఒక్కటే మేలు
- రేవంత్‌ను ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్న హరీష్ రావు



**హైదరాబాద్, జనవరి 30:** ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్‌రెడ్డి దోస్తీ కట్టి తెలంగాణకు అన్యాయం చేస్తున్నడని హరీష్‌రావు విమర్శించారు. చంద్రబాబుతో దోస్తీ కోసం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న రేవంత్‌రెడ్డిని తెలంగాణ సమాజం క్షమించదని అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి హరీష్‌రావు మాట్లాడారు. కేసీఆర్ హయాంలో కేంద్రానికి 10 డీపీఆర్‌లు పంపి ఏడు ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ఒక్క అనుమతి కూడా తేలేదని ఎద్దేవా చేశారు. 'ఢిల్లీ మీటింగ్‌కు వెళ్లేందుకు ఆదిత్యనాథ్ మినహా తెలంగాణ సోయి కలిగిన ఒక్క ఇంజినీర్ దొరకలేదా..?' అని హరీష్‌రావు ప్రశ్నించారు. మన తెలంగాణ నీళ్లను ఏపీకి తీసుకువెళ్లే కుట్ర ఇది. తెలంగాణ సోయి ఉన్న ఒక్క ఇంజినీర్ దొరకలేదా..? దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు చేస్తున్నారు. పోనుపోను అంటూనే మీటింగ్‌లకు అటెండ్ కావడం ఏమిటి..? తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఏపీకి అప్పజెప్పడమే మీ చర్చల లక్ష్యమా..?' అని ప్రశ్నించారు. సమైక్య పాలనలో మనకు నీటి వాటాల్లో తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ.. నేడు మరో చారిత్రక ద్రోహం చేస్తున్నదని మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. ఇవాళ్టి ఇరిగేషన్ మీటింగ్ ద్వారా రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు తెలంగాణకు మరణశాసనం రాయబోతున్నదని చెప్పారు. పోలవరం నల్లమలసాగర్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఏపీకి సహకరిస్తున్నది. ఆ కుట్రల తీరును ఒకసారి గమనించండి. పోను పోను అనుకుంటూనే నాడు డిల్లీ మీటింగ్‌కు వెళ్ళాడు. ఎజెండాలో లేదంటూనే బనకచర్లపై చర్చ జరిపాడు. పెట్టబోను అంటూనే సంతకంపెట్టి తెలంగాణ నదీ జలాల హక్కులను కాలరాశాడు. వేయను అంటూనే కమిటీవేసి ఏపీ జలదోపిడీకి రెడ్ కార్పెట్ వేశాడు. టెండర్ చివరి తేదీ అయిపోయాక సుప్రీంకోర్టుకు వెళ్ళి నల్లమలసాగర్ ప్రాజెక్టుకు పరోక్షంగా అంగీకారం తెలిపాడు. పసలేని రిట్ వేసి పరిపూర్ణంగా నల్లమలసాగర్‌కు మద్దతు ప్రకటించాడు' అని రేవంత్ కుట్రలను వెల్లడించాడు. చంద్రబాబుకు రేవంత్ గురుదక్షిణ చెల్లిస్తున్నడు. ఏపీ ఒత్తిడితో ఇవాళ జరుగుతున్న ఢిల్లీ మీటింగ్‌లో ఇంజినీర్లు పాల్గొంటున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ నీటిని ఒడిసిపట్టిండ్రని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి విడిచిపెట్టిండని హరీష్‌రావు మండిపడ్డారు. ఏపీ పాలకులతో కలిసి తెలంగాణకు జలద్రోహం చేస్తున్నడని విమర్శించారు. రేవంత్‌రెడ్డి దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని హెచ్చరించారు. కేసీఆర్ పాలన గురించి ఎకనామిక్ సర్వే రిపోర్టే స్పష్టం చేసింది. తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించింది. రెండు కోట్ల 20 లక్షల ఎకరాలు మాగాణిగా మారింది. కాళేశ్వరం, మిషన్ కాకతీయ ద్వారా అద్భుతమైన ఆయకట్టు వచ్చింది. కాళేశ్వరం ద్వారా 17 లక్షల 823 ఎకరాల స్థిరీకరణ, మిషన్ కాకతీయ ద్వారా పదిహేను లక్షల ఎకరాల ఆయకట్టు సాధ్యమైంది. 32 లక్షల ఎకరాల ఆయకట్టు బీఆర్‌ఎస్ సాధించింది' అని మాజీ మంత్రి చెప్పారు. 'బీజేపీ నేతలు బండి సంజయ్, కిషన్ రెడ్డి ఇప్పటికైనా నోరు పారేసుకోవడం మానుకుంటే మంచిది. కేంద్రంలోని మీ ప్రభుత్వమే తెలంగాణ ప్రగతిపథాన్ని వివరించింది. కళ్లు తెరవండి అనవసరంగా బీఆర్‌ఎస్ మీద నోళ్లు పారేసుకోకండి' అని హరీష్‌రావు బీజేపీ నేతలకు హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఢిల్లీ మీటింగ్‌ను బాయ్‌కాట్ చేయాలని డిమాండ్ చేశారు. పాలకులకు ఢిల్లీకి, దావోస్‌కు తిరగడమే తప్ప పాలన మీద దృష్టి లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ సేద్యంపై దృష్టిసారిస్తే, రేవంత్ చోద్యం చూస్తున్నడని ఆరోపించారు.



# వనదేవతల వైభవం

- మేడారంలో భక్తి పారవశ్యం
- క్యూ కట్టిన కోట్లాది భక్తజనం..
- తరలివచ్చిన గవర్నర్, మంత్రులు!





**మేడారం, జనవరి 30 :** మేడారం మహా జాతరలో సమ్మక్క, సారలమ్మలు గద్దెలనెక్కారు. ఈ నేపథ్యంలో ఆ వన దేవతలను దర్శించుకునేందుకు భక్తులు శుక్రవారం పోటెత్తారు. దీంతో భక్తులను కంట్రోలు చేయడం ఒకానొక దశలో తీవ్రంగా పరిణమించింది. ఇప్పటికే పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఈ జాతరకు హాజరై.. వన దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈనె 28న ప్రారంభమైన ఈ జాతర.. 31న ముగియనుంది. ఇంకో వైపు జాతరలో జరుగుతున్న పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో భక్తులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. అదే సమయంలో మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్ కూడా అక్కడే ఉన్నారు. ఆయన కారు అద్దాలతో పాటు స్థానిక షాపులను భక్తులు ధ్వంసం చేశారు. అలాగే భక్తుల రద్దీని నియంత్రించడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారని.. వారంతా వీవీఐపీలు, పోలీస్ కుటుంబాల సేవల్లో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో జాతరకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమ్మక్క-సారలమ్మ తల్లులను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ దర్శించుకుని, నిలువెత్తు బంగారం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తల్లులను దర్శించుకున్నారు. మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ అమ్మవార్లను దర్శించుకున్నారు .మంత్రి శ్రీమతి సీతక్క, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, గండ్ర సత్యనారాయణ అమ్మవార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ గ్యారత్ వెన్ ఓవెన్ సమ్మక్క-సారలమ్మలకు తులాభారం సమర్పించి తల్లులను దర్శించుకున్నారు .ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత జాతరలతో పోలిస్తే ఈసారి దర్శనాలు మరింత సులభంగా, వేగంగా జరుగుతున్నాయని, భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని భక్తులు ప్రశంసిస్తున్నారు.








# ఐపీఎస్ అధికారిపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు

## క్షమాపణలు చెప్పాలని అధికారుల సంఘం డిమాండ్

## బేషరతుగా క్షమాపణలు చెప్పిన కౌశిక్ రెడ్డి



**హైదరాబాద్, జనవరి 30:** తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘానికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఎవరినీ ఉద్దేశ్యపూర్వకంగా అన్న మాటలు కాదు.. మనోభావాలు దెబ్బతింటే క్షమాపణలు చెబుతున్నాను. సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్బలంతో నాపై, నా కుటుంబం పై రాజకీయ కక్షకు తెగబడ్డారు. పోలీసులు, అధికారులు అంటే నాకు ఎంతో గౌరవం ఉంది. కానీ కొందరు.. మేము సమ్మక్క జాతరకు వెళ్తున్న క్రమంలో అడ్డుకొని, తీవ్ర ఒత్తిడికి గురి చేశారు. ఆ ఫ్రస్టేషన్, ఒత్తిడిలో తెలియకుండా నోరు జారాను. అంతే తప్ప ఉద్దేశ్య పూర్వకంగా అన్న మాటలు కావు. నా మాటలతో ఎవరివైనా మనోభావాలు దెబ్బతింటే వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను. ఈ విషయంలో కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని అందరిని వేడుకుంటున్నా ను.' అని అభ్యర్థిస్తూ కౌశిక్ రెడ్డి వీడియో విడుదల చేశారు. గురువారం నాడు వీణవంకలోని స్థానిక సమ్మక్క సారలమ్మ జాతరకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కుటుంబ సమేతంగా వెళ్లారు. ఆ సమయంలో పోలీసులకు, కౌశిక్ రెడ్డికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సహనం కోల్పోయిన కౌశిక్ రెడ్డి.. ఐపీఎస్ అధికారిని మతం పేరుతో దూషించారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ఐపీఎస్ అధికారుల సంఘం.. కౌశిక్ రెడ్డి తీరును తీవ్రంగా ఖండించింది. ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని.. వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో స్పందించిన కౌశిక్ రెడ్డి.. పోలీసులకు క్షమాపణలు చెబుతూ ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేశారు. తన వ్యాఖ్యల పట్ల వివరణ ఇచ్చారు. తన క్షమాపణల అనంతరం ఈ వివాదాన్ని ఇక్కడితో ముగించాలని కౌశిక్ రెడ్డి కోరారు. అయితే ఐపీఎస్ అధికారిపై బీఆర్‌ఎస్ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ పేర్కొంది. మతం పేరుతో ఆరోపణలు చేయడం దారుణమని చెప్పుకొచ్చింది. కరీంనగర్ సీపీ గౌస్ ఆలంపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. విధుల్లో నిబద్ధతతో పనిచేస్తున్న అధికారిపై వ్యక్తిగత దాడి చేశారని అసోసియేషన్ మండిపడింది. మత మార్పిడుల ఆరోపణలకు ఎలాంటి ఆధారాలూ లేవని తెలంగాణ ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ ఘటన సివిల్ సర్వీస్ అధికారుల మనోబలాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని తెలిపింది. ఎమ్మెల్యే ప్రవర్తనపై తక్షణ విచారణకు డిమాండ్ చేసింది. ఎమ్మెల్యే నుంచి బహిరంగ క్షమాపణ కోరింది. ప్రస్తుతం పనిచేస్తున్న అధికారి మతమార్పిడికి ప్రయత్నిస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తూ.. అతని మతం గురించి చేసిన ఆరోపణలతో తీవ్రంగా కలత చెందుతున్నామని పేర్కొంది. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ క్రమంలో కౌశిక్ రెడ్డి క్షమాపణలు తెలిపారు.

# తెలంగాణ టెట్ ప్రాథమిక 'కీ' విడుదల

**హైదరాబాద్, జనవరి 30:** తెలంగాణ టెట్ ప్రాథమిక 'కీ' విడుదలైంది. టెట్ 2026 జనవరి కీ, రెస్పాన్స్ షీట్‌లను పాఠశాల విద్యాశాఖ శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేసింది. ఈ నెల 3 నుంచి 20 వరకు టెట్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. టెట్ 'కీ'పై అభ్యంతరాలను నేటి నుంచి ఫిబ్రవరి 1న సాయంత్రం 5గంటల వరకు స్వీకరించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. తెలంగాణ టెట్ పేపర్ 1, పేపర్ 2కు కలిపి దాదాపు 2.37లక్షల దరఖాస్తులు రాగా.. వీటిలో 71,670మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఉన్నారు. మరిన్ని వివరాలను టెట్ అధికారిక వెబ్‌సైట్‌లో చూడొచ్చని తెలిపింది.

# తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాల సాధనకు కృషి

## అన్ని శాఖలు నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగాలి

## వ్యవసాయ, మత్స్య, కార్మిక శాఖలతో సీఎస్ సమీక్ష

**హైదరాబాద్, జనవరి 30:** తెలంగాణ విజన్ 2047 లక్ష్యాలను చేరుకోవడానికి అన్ని ప్రభుత్వ శాఖలు నిర్దేశిత ప్రణాళికతో ముందుకు సాగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గత మూడు రోజులుగా వివిధ విభాగాలపై సమీక్ష నిర్వహిస్తున్న ఆయన, శుక్రవారం డా.బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో వ్యవసాయ, మత్స్య, అటవీ, పౌర సరఫరాలు మరియు కార్మిక శాఖల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. రైతు సంక్షేమానికి పెద్దపీట రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, భవిష్యత్తులో యూరియా, ఎరువుల పంపిణీని ఐటీ ఆధారిత సేవల ద్వారా పటిష్టం చేయాలని సి.ఎస్ సూచించారు. ఆయిల్ పామ్ సాగు, పండ్లు, కూరగాయల పెంపకాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని, డిజిటల్ క్రాప్ సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా కోహెడ మార్కెట్ పనుల పురోగతిని సమీక్షించిన ఆయన, రాబోయే సాగు కాలానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు ముందస్తుగా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. పాడి, మత్స్య రంగాల బలోపేతం పశువైద్య సేవలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని, పశువుల వ్యాధుల నివారణకు టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సి.ఎస్ పేర్కొన్నారు. పాల సేకరణ సామర్థ్యాన్ని పెంచి, చిన్న పాడి రైతులకు లాభదాయకమైన విధానాలు రూపొందించాలని సూచించారు. మత్స్యశాఖ సమీక్షలో భాగంగా.. మల్లన్న సాగర్, కొండపోచమ్మ వంటి జలాశయాల్లో చేపల పెంపకంపై ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. పర్యావరణం, అటవీ సంరక్షణ అటవీ విస్తీర్ణం పెంపు, జీవ వైవిధ్య సంరక్షణపై సమీక్షించిన సీఎస్.. కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతాల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. హరిత నిధి, ఎకో టూరిజం, అర్బన్ పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే, పౌర సరఫరాల శాఖ ద్వారా లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ, రేషన్ దుకాణాల పనితీరును మెరుగుపరచాలని సూచించారు. యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు కార్మిక మరియు ఉపాధి శాఖల సమీక్షలో భాగంగా.. యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి విదేశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సి.ఎస్ ఆదేశించారు. ముఖ్యంగా నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన వారికి విదేశాల్లో ఉపాధి కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు దాన కిషోర్, బి.ఎమ్.డి. ఎక్కా, అటవీ శాఖ కార్యదర్శి అహ్మద్ నదీమ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
కరీంనగర్
శనివారం
31 జనవరి 2026




సంపాదకీయం

# వాస్తవ పరిస్థితులను బడ్జెట్ గుర్తించేనా?

ఏటేటా బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వే ప్రవేశ పెట్టడం, దానిపై పెద్దగా పట్టింపు లేకుండా బడ్జెట్ ప్రవేశ పెట్టడం..తూతూ మంత్రంగా సాగిపోతోంది. దేశంలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని బడ్జెట్ ప్రతిపాదనలు రావడం లేదు. మూడో ఆర్థిక శక్తిగా ఎదగాలన్న మాటలకు చేతలకు పొంతన లేకుండా పోతోంది. నిజం చెప్పాలంటే ప్రజలను మభ్యపెట్టడబం తప్ప, వాస్తవాలను పాలకులు గ్రహించడం లేదు. ప్రపంచ ఆర్థిక మాంద్యం తరుముకు వస్తున్న వేళ దేశీయంగా దిద్దుబాటు చర్యలు తీసుకోవడం లేదు. యువతకు చేతినండా పిన కల్పించడం, ధరలను అదుపు చేయడం, నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టడం వంటి చర్యలను గుర్తించడం లేదు. అమెరికా వీసాల కట్టడితో మనదేశం నుంచి వెళుతున్న నిరుద్యోగులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. అక్కడా ఉద్యోగాల కల్పన అన్నది భ్రమగా మారింది. ప్రపంచంలో డాలర్ పతనం ప్రారంభం అయ్యింది. ఈ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. ట్రంప్ సుంకాల కారణంగా మాన మార్కెట్లు కుదేలవుతున్నాయి. దీనిపైనా ముందస్తు వ్యూహం ఉండాలి. చెప్పాలంటే ప్రతికూల పరిస్థితుల్లో దేశం ముందుకు వెళ్లే ప్రయత్నాలు సాగాలి. మన ఉత్పత్తులను మనం ఉపయోగించే పరిస్థితి రావాలి. దేశంలోని యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా వస్తూత్పత్తిని పెంచుకోవచ్చు. ధాన్యం దిగుబబడులకు అనుగుణంగా మార్కెట్ లేదు. ఇవన్నీ కూడా బడ్జెట్‌లో ఎప్పుడూ చర్చించడం లేదు. ప్రస్తుతం అంటే ఫిబ్రవరి1న ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో చర్చిస్తారా అన్నది చూడాలి. మనకున్న సహజ వనరులను, మానవనరులను ఎలా జోడించి వినియోగించుకోగలమో అన్న ప్రణాళిక లేకుండా బడ్జెట్ ప్రతిపాదనలు సాగుతున్నాయి. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని పరితపిస్తున్న భారత్ ఒకవైపు అవకాశాలు, మరోవైపు ముప్పులు పొంచివున్నట్లు జాతీయ ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్న పరిస్థితుల్లోనూ భారత్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.4 శాతం వృద్ధిరేటు సాధిస్తుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ముఖ్యంగా ప్రపంచాన్ని ఊపేస్తున్న ఏఐ విప్లవాన్ని అందిపుచ్చుకుంటే అమెరికా తర్వాత అత్యధిక ఏఐ లిటరేట్స్ ఉన్న భారతదేశం జీడీపీ పరంగా ఎక్కడికో వెళ్లిపోతుందని అంచనా వేస్తోంది. కంపెనీలన్నీ ఏఐ రంగంలో లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు కుమ్మరించిన నేపథ్యంలో ఏమైనా తేడా వస్తే మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థే 2008 తరహా సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలా జరిగే అవకాశం 10 నుంచి 20 శాతం వరకు ఉందని, దాన్ని విస్మరించలేమని చెప్పింది. అదే జరిగితే మనుగడ పోరాటంలో భాగంగా మహామహా ఐటీ కంపెనీలు పెట్టే బడ్జెట్ కోతల్లో ప్రధానంగా సమిధలయ్యేది భారతీయవైట్ కాలర్ ఉద్యోగులేనని హెచ్చరించింది. ఏఐ అమల్లోకి వచ్చిన 2022 నుంచే రొటీన్ ఉద్యోగాల కోతలు మొదలయ్యాయని, ఆర్థిక సంక్షోభం ఖాయమైతే తీవ్రత ఊహించలేని విధంగా ఉంటుందని అప్రమత్తం చేసింది. కేంద్రం ఏఐ ఆర్థిక మండలిని ఏర్పాటు చేసి, ఉద్యోగాలను కాపాడుకొనే మార్గాలను అన్వేషించాలని పిలుపునిచ్చింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటులో ఎకనామిక్ సర్వేను ప్రవేశ పెట్టారు. దీని ప్రకారం.. 2026-27 ఆర్థిక సంవత్సరం లో భారతదేశపు ఎకానమీ 6.8 శాతం నుండి 7.2 శాతం మధ్య వృద్ధి చెందుతుందని అంచనా వేశారు. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం స్థిరంగా దూసుకుపోతుండటం విశేషం. మన దేశ సంభావ్య వృద్ధి రేటు సుమారు 7 శాతంగా ఉంటుందని సర్వే పేర్కొంది. దేశీయ డిమాండ్.. వృద్ధికి వెన్నెముక ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు కొంత ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, భారతదేశం అంతర్గత బలాలు ఆర్థిక వ్యవస్థను కాపాడుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం పెరగడం, వ్యవసాయ రంగం మెరుగైన ప్రదర్శన కనబరచడం వృద్ధికి ప్రధాన కారణాలుగా మారాయి. అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో కూడా ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. ప్రభుత్వం చేపట్టిన పన్ను హేతుబద్ధీకరణ చర్యల వల్ల సామాన్యుడి చేతిలో ఖర్చు పెట్టడానికి ఎక్కువ డబ్బులు మిగులుతున్నాయని, ఇది దేశీయ మార్కెట్లో వస్తువుల డిమాండ్ పెరగడానికి దోహదపడిందని సర్వే విశ్లేషించింది. అయితే అంతర్జాతీయ మార్కెట్లలో వచ్చే ఒడిదుడుకులను తట్టుకోగలిగేంత పటిష్టమైన బఫర్స్ భారత్ వద్ద ఉన్నాయని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేసింది. ఆర్థిక క్రమశిక్షణ పాటించడం వల్ల విదేశీ పెట్టుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నాయని పేర్కొంది. సవాళ్లు , భవిష్యత్తు అంచనాలు వృద్ధి రేటు బాగున్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ట్రేడ్ ఫ్రాగ్మెంటేషన్, ఆర్థిక రంగంలో నెలకొన్న సున్నితమైన పరిస్థితులపై సర్వే హెచ్చరించింది. గ్లోబల్ మార్కెట్లలో వచ్చే మార్పులు మనపై కొంత ఆలస్యంగా ప్రభావం చూపే అవకాశం ఉందని, కాబట్టి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు , స్థిరమైన స్థూల ఆర్థిక విధానాలు మన దేశాన్ని ప్రపంచ ఆర్థిక పటంలో అగ్రస్థానంలో నిలుపుతాయని ఎకనామిక్ సర్వే ఆశాభావం వ్యక్తం చేసింది. విద్యార్థులు ఏఐని విచ్చలవిడిగా వాడటం వల్ల ఆందోళన, కుంగుబాటు పెరిగి సమస్యను పరిష్కరించే సామర్థ్యాన్ని కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. మొత్తంగా ఆర్థిక సర్వే ఆశాజనక సూచనలు చేసినా, క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధ పరిస్థితి ఉంది. నిరుద్యోగం తాండవిస్తోంది. పేదరికం ఇంకా పెరుగుతోంది. వీటిని సమీక్షించాల్సిన అసవరం ఉంది. ఆ మేరకు బడ్జెట్‌లో ప్రతిపాదనలు రావాలి. సమస్యలను చర్చించి, అధిగమించే ప్రయత్నాలు చేపట్టాలి. అప్పుడే ఆర్థికంగా దేశం బలోపేతం కాగలదు.



# బాపూజీకి దేశం ఘన నివాళి

- మహాత్మాగాంధీ 78వ వర్ధంతి
- రాజ్‌ఘాట్ వద్ద రాష్ట్రపతి, ప్రధాని నివాళి
- నివాళి అర్పించిన చంద్రబాబు



**న్యూఢిల్లీ, జనవరి 30:** మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా రాజ్ ఘాట్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీసహా పలువురు ప్రముఖులు గాంధీకి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, రిటైర్డ్ అధికారులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు కూడా పాల్గొన్నారు. రాజ్‌గాట్‌లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. ఆయన విలక్షణ వ్యక్తిత్వం, విజయాలు మన దేశస్థులకు ఎల్లప్పుడూ సరైన మార్గాన్ని చూపిస్తూ ప్రేరణగా ఉంటాయి. అభివృద్ధి చెందిన, స్వావలంబన భారతదేశం కోసం మన సంకల్పానికి ఆయన చిహ్నంగా నిలుస్తారని తెలిపారు.మహాత్మా గాంధీ జీవితం నిజాయితీ, సత్యాగ్రహం, అహింసా మార్గదర్శకలు, సామాజిక న్యాయం కోసం చేసిన ప్రేరణాత్మక ప్రయత్నాలతో గుర్తింపు పొందింది. ఆయన వ్యక్తిత్వం, విజ్ఞానం యువత, ప్రజలకి సామాజిక సమతా, దేశభక్తి మరియు స్వావలంబన పట్ల ప్రేరణగా నిలుస్తాయి. కార్యక్రమంలో గాంధీకి ప్రత్యేక పుష్పాంజలి, ప్రతిమలకు పూల మాలలు, స్మరణీయ ప్రసంగాలు, సంగీత కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. భక్తులు, స్థానికులు, పర్యాటకులు కూడా భాగస్వామ్యమై, గాంధీ జీవితం, సూత్రాలు గురించి అవగాహన పెంపొందించు కున్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేసారు.జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళి అర్పిస్తున్నాను. అహింసా విధానంతో కోట్ల మంది దేశప్రజలను ఒక్కతాటిపై నడిపి స్వాతంత్ర్యం సాధించారు. గాంధీజీ బోధనలైన సత్యం, అహింస, శాంతి, సేవ అనే సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ నిత్యం పాటించాలి. స్వదేశీ, మహిళా సాధికారత, గ్రామ స్వరాజ్యం, పేదరిక నిర్మూలన వంటి గాంధీజీ ఆశయాలను నిజం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేద్దామని అన్నారు. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. 'సత్యం తాత్కాలికంగా ఓడినట్టుగా కనిపించవచ్చు.. కానీ ఎప్పటికీ ఓడదు' అని చెప్పడమే కాక.. తన చివరి శ్వాస వరకు సత్యానికే అంకితమైన జీవితాన్ని గడిపిన మహనీయుడు మహాత్మా గాంధీ. నేడు జాతిపిత వర్ధంతి సందర్భంగా ఆయనకు మనస్ఫూర్తిగా నివాళులు' అని వైఎస్ జగన్ ట్వీట్ ద్వారా పేర్కొన్నారు. ఈ ట్వీట్ ద్వారా గాంధీజీ జీవితాన్ని, ఆయన బోధనలను జగన్ గుర్తుచేసుకున్నారు.

# ఆర్థికమంత్రిగా నిర్మలమ్మ రికార్డు

## వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ సమర్పణ

## అత్యధికసార్లు ప్రవేశ పెట్టిన మహిళా మంత్రిగా ఘనత



**న్యూఢిల్లీ, జనవరి 30:** నిర్మలా సీతారామన్ ఆర్థికమంత్రిగా చరిత్ర సృష్టించేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 1న ఆమె పార్లమెంటులో బడ్జెడెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ వరుసగా ప్రవేశపెట్టనున్న 9వ బడ్జెట్ ఇది. పార్లమెంటులో 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు మాజీ మంత్రి పి.చిదంబరం సొంతం. 1996లో అప్పటి ప్రధాని హెచ్‌డీ దేవగౌడ సారథ్యంలో మంత్రి చిదంబరం తొలిసారిగా బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఆ తరువాత 1997లో రెండోసారి, 2004-08 మధ్య కాలంలో వరుసగా ఐదు సార్లు, 2013, 2014ల్లో మరో రెండు సార్లు ఆయన బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇక లోక్‌సభలో అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం చేసిన మంత్రిగా నిర్మలా సీతారామన్ ఇప్పటికే అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. భారత్‌కు సంబంధించిన తొలి బడ్జెట్‌ను 1860లో అప్పటి ఆర్థిక మంత్రి జేమ్స్ విల్సన్ ప్రవేశపెట్టారు. భారత మండలి సభ్యుడిగా ఆయన ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. 1857 సిపాయి తిరుగుబాటు అనంతరం, భారత ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల పేరిట వలసపాలకులు ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక స్వాతంత్ర్యానంతరం, 1947 నవంబర్ 26న భారత దేశ ఆర్థిక మంత్రి ఆర్‌కే షణ్ముఖం చెట్టి తొలి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అత్యధిక సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రికార్డును మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ సొంతం చేసుకున్నారు. మొత్తం 10 బడ్జెట్‌లను ఆయన పార్లమెంటు ముందుకు తెచ్చారు. 1959-64 మధ్యకాలంలో ఆర్థిక మంత్రిగా ఆరు సార్లు, ఆ తరువాత 1967-1969 మధ్య మరో నాలుగు సార్లు ప్రవేశపెట్టారు. ఇక ప్రణబ్ ముఖర్జీ కూడా వివిధ సందర్భాల్లో మొత్తం 8 బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు. 1982-84 మధ్యకాలంలో వరుసగా మూడు సార్లు, ఆ తరువాత 2009-12 మధ్య వరుసగా ఐదు సార్లు బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వరుసగా ఐదు సార్లు పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.ఇప్పుడు తొమ్మిదోసారి నిర్మలమ్మ బడ్జెట్‌తో ముందుకు రానున్నరు. ఈ మూడేళ్లు ఆమె ఆర్థికమంత్రిగా కొనసాగితే రికార్డు సృష్టించడం ఖాయం.



# బంగారం.. తిరోగమనం

## భారీగా తగ్గిన ధరలు.. ● రూ.1,80,779 దగ్గర ట్రేడ్

**న్యూఢిల్లీ, జనవరి 30:** కొన్ని రోజుల నుంచి చుక్కలు చూపిస్తున్న బంగారం, వెండి ధరలు శుక్రవారం భారీగా తగ్గాయి. గురువారం ఆల్‌టైమ్ రికార్డ్ స్థాయికి చేరిన బంగారం, వెండి ధరలు శుక్రవారం అథ:పాతాళానికి పడిపోయాయి. స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర హైదరాబాద్ మార్కెట్‌లో 1,80,779 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కిలో వెండి ధర రూ. 4,20,048 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు ఊహించని విధంగా ధరలు భారీ స్థాయిలో పతనమయ్యాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంపై రూ. 15,246 తగ్గింది. ప్రస్తుత ధర రూ. 1,54,157 ఉంది. వెండిపై ఏకంగా రూ. 67,891లు తగ్గింది. ప్రస్తుత ధర 3,32,002 రూపాయలుగా ఉంది. బంగారం, వెండి ధరలు ఒకే రోజు ఇంతలా పతనమవడానికి కారణం ఇన్వెస్టర్లు భారీ ప్రాఫిట్ బుకింగ్‌కు దిగటమేనని మార్కెట్ అనలిస్టులు చెబుతున్నారు. ఫ్యూచర్స్‌తో పోలిస్తే ఈటీఎఫ్ ధరలు మరింత పతనమయ్యాయని తెలిపారు. ఫెడ్ తదుపరి చీఫ్‌గా ఆ విభాగం మాజీ అధికారి కెవిన్ వార్ష్‌ను నామినేట్ చేస్తారన్న వార్తలు కూడా బంగారం, వెండి ధరలు తగ్గటానికి మరో కారణమని అనలిస్టులు అంటున్నారు.

# రికార్డు చేసుకో.. మీ అక్కను చంపేస్తున్నా

## బావమరిదికి ఫోన్ చేసి మరీ భార్యను చంపిన దుర్మార్గుడు

## స్వాట్ కమాండో హత్య కేసులో దర్యాప్తు



**న్యూఢిల్లీ, జనవరి 30:** దేశ రాజధాని నగర పోలీసు విభాగంలో స్వాట్ కమాండోగా పని చేస్తున్న కాజల్ చౌధరి(27)ని ఆమె భర్త అంకుర్ డంబెల్‌తో కొట్టి చంపిన కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. మృతురాలి సోదరుడు నిఖిల్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. హత్యకు సంబంధించిన పలు కీలక విషయాలు వెల్లడించాడు. 'హత్యకు ముందు నా సోదరి కాల్ చేసి, తన భర్త వేధిస్తున్నట్లు చెప్పింది. అదే సమయంలో అక్కడే ఉన్న అంకుర్ ఆమె నుంచి ఫోన్ లాక్కొని రికార్డు చేసి పెట్టుకో.. పోలీసులకు ఆధారంగా పనికొస్తాయి. మీ అక్కను చంపు తున్నా అని బెదిరించాడు. ఆ సమయంలో అతడిని ఎంత సముదాయించడానికి ప్రయత్నించినప్పటికీ నా మాటలు విన లేదు. కొంతసేపటి తర్వాత అంకుర్ కాల్ చేసి, కాజల్ చనిపోయిందని.. గాజియాబాద్ ఆస్పత్రికి వచ్చి చూసుకొమ్మని చెప్పాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి వెళ్లగా గర్భిణి అయిన నా సోదరి మృతి చెంది ఉందని సోదరుడు నిఖిల్ బావురుమన్నాడు. 2023లో అంకుర్‌తో కాజల్ వివాహం అయిన సమయంలో పెద్ద మొత్తంలో కట్నం ఇచ్చామని, అయినా అత్తింటివారు అదనపు కట్నం కోసం తన కుమార్తెను వేధించేవారని మృతురాలి తల్లి ఆరోపించింది. రక్షణశాఖలో క్లర్కుగా పనిచేస్తున్న అంకుర్‌కు ఆర్థికపరమైన అంశాల్లో భార్య కాజల్‌తో తరచూ గొడవలు జరిగేవి. ఈ నెల 22న దంపతుల మధ్య గొడవ తీవ్రరూపం దాల్చడంతో విచక్షణ కోల్పోయిన అంకుర్ ఆమెపై దాడిచేసి, డంబెల్‌తో తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన కాజల్ గాజియాబాద్ ఆసుపత్రిలో 5రోజులు మృత్యువుతో పోరాడి మంగళవారం మృతి చెందగా.. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అంకుర్‌ను అరెస్టు చేసిన పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఢిల్లీలోని మోహన్ గార్డెన్ ప్రాంతంలో కాజల్-అంకుర్ నివాసంలో ఈ ఘటన జరిగింది. భర్త.. నిందితుడైన అంకుర్ తన భార్య కాజల్ తలని తలుపు ఫ్రేమ్‌కు బలంగా కొట్టి, ఆపై బర-ువైన డంబెల్ తో ఆమె తలపై దాడి చేశాడు. దాడి సమయంలో కాజల్ నాలుగు నెలల గర్భిణీ. ఆసుపత్రిలో ఐదు రోజులపాటు మృత్యువుతో పోరాడి, జనవరి 27న కమాండో కాజల్ కన్నుమూశారు. కట్నం వేధింపులే తమ బిడ్డ హత్యకు ప్రధాన కారణమని కాజల్ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. నిందితుడు అంకుర్ చౌదరి కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖలో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లిలో బుల్లెట్ బైక్, బంగారం ఇచ్చినప్పటికీ, కారు ఇవ్వలేదని అతను తరచూ కాజల్‌ను వేధించేవాడని తెలుస్తోంది. పోలీసులు.. నిందితుడు అంకుర్ చౌదరిని అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపారు. ముందుగా హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు.. కాజల్ మరణం తర్వాత దానిని హత్య కేసుగా మార్చారు. కాజల్-అంకుర్ దంపతులకు ఇప్పటికే ఒకటిన్నర ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం ఆ బాబు కాజల్ తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు.

# పీటీ ఉష ఇంట తీవ్ర విషాదం.. భర్త శ్రీనివాస్ కన్నుమూత

### శుక్రవారం తెల్లవారుజామున హఠాన్మరణం.. కుప్పకూలిన కొద్దిసేపటికే మృతి

### ఉష విజయాల వెనుక ఉన్న నిశ్శబ్ద శక్తి ఆయనే: కన్నీటి పర్యంతమైన కుటుంబం

### ప్రగాఢ సంతాపం తెలిపిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు



**న్యూఢిల్లీ, జనవరి 30:** భారత క్రీడా దిగ్గజం, 'పరుగుల రాణి'గా పేరొందిన రాజ్యసభ సభ్యురాలు, భారత ఒలింపిక్ సంఘంఅధ్యక్షురాలు పి.టి. ఉష కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె భర్త, మాజీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి వి. శ్రీనివాసన్ (67) శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన హఠాన్మరణంతో క్రీడాలోకం దిగ్భ్రాంతికి గురైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున శ్రీనివాసన్ తన నివాసంలో ఉన్నట్టుండి అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆయనను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆయన అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. వైద్యపరంగా అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, ఆసుపత్రికి తీసుకువచ్చే సమయానికే పరిస్థితి చేజారిపోయిందని డాక్టర్లు తెలిపారు. పి.టి. ఉష, శ్రీనివాసన్ దంపతులకు 'ఉజ్వల్' అనే కుమారుడు ఉన్నారు. వి. శ్రీనివాసన్ మాజీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. పి.టి. ఉష క్రీడా ప్రస్థానంలోనే కాకుండా, ఆమె రాజకీయ ప్రయాణంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. ఉష సాధించిన అనేక విజయాల వెనుక ఆయన నిశ్శబ్ద శక్తిగా, బలమైన మద్దతుదారుగా నిలిచారు. ప్రతి అడుగులోనూ ఆమెకు అండగా ఉంటూ ప్రోత్సహించారు.

#### ప్రధాని మోదీ దిగ్భ్రాంతి..

శ్రీనివాసన్ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో తన ఆలోచనలన్నీ ఉష కుటుంబం చుట్టూనే ఉన్నాయని, మరణించిన ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కూడా సంతాపం వ్యక్తం చేశారు. "పీటీ ఉష భర్త శ్రీనివాసన్ మృతి చాలా బాధాకరం. ఉషతో పాటు ఆమె కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఈ కష్టకాలంలో దేవుడు ఆమెకు మనోధైర్యాన్ని ప్రసాదించాలి" అని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేశారు. క్రీడాకారులు, కోచ్‌లు, అభిమానులు సోషల్ మీడియా ద్వారా పీటీ ఉషకు సానుభూతి తెలుపుతున్నారు.



## మాయమైన కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్.. ఫ్యాన్స్‌లో హైటెన్షన్!

### శుక్రవారం తెల్లవారుజామున ఘటన.. 6 గంటల పాటు సస్పెన్స్

### 'పేజ్ నాట్ అవైలబుల్' రావడంతో హ్యాక్ అయ్యిందేమోనని ఆందోళన

### ఎట్టకేలకు రీ-స్టోర్ కావడంతో ఊపిరి పీల్చుకున్న అభిమానులు

**ముంబై, జనవరి 30:** మైదానంలో తన ఆటతీరుతో, బయట తన స్టైల్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న టీమిండియా స్టార్ క్రికెటర్ 'కింగ్' విరాట్ కోహ్లీ ఫ్యాన్స్‌కు శుక్రవారం ఉదయం పెద్ద షాక్ తగిలింది. ఆసియాలోనే అత్యధిక ఫాలోవర్లు (27 కోట్లకు పైగా) కలిగిన కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా (ఏజఱఅతీ్‌.ఎశీష్ట్రశీఱ) అకస్మాత్తుగా మాయమవడంతో డిజిటల్ ప్రపంచంలో ఒక్కసారిగా కలకలం రేగింది. శుక్రవారం తెల్లవారుజామున అభిమానులు కోహ్లీ ప్రొఫైల్ చూసేందుకు ప్రయత్నించగా.. అది కనిపించకుండా పోయింది. స్క్రీన్ పై "ఈ పేజీ అందుబాటులో లేదు" అనే సందేశం రావడంతో ఫ్యాన్స్ గందరగోళానికి గురయ్యారు. ఇటీవలే న్యూజిలాండ్‌పై 124 పరుగుల అద్భుత ఇన్నింగ్స్ ఆడి, ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో తిరిగి నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్న తరుణంలో ఇలా జరగడం అభిమానులకు మింగుడు పడలేదు. అయితే, కోహ్లీ 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా మాత్రం యాక్టివ్‌గానే ఉండటంతో ఏం జరుగుతుందో అర్థంకాక నెటిజన్లు జుట్టు పీక్కున్నారు.

#### వైరల్ అయిన 'పెంగ్విన్' మీమ్..

భారీ స్థాయిలో హ్యాకింగ్ జరిగిందా? లేక విరాట్ కావాలనే సోషల్ మీడియాకు బ్రేక్ ఇచ్చాడా? అనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువలా వచ్చాయి. ముఖ్యంగా ఎక్కడికో నడుచుకుంటూ వెళ్లిపోయే "నిహిలిస్ట్ పెంగ్విన్" మీమ్ విపరీతంగా వైరల్ అయ్యింది. కోహ్లీ కూడా ఇలాగే ఇంటర్నెట్ నుంచి దూరంగా వెళ్లిపోయాడంటూ నెటిజన్లు సెటైర్లు వేశారు.

#### 6 గంటల తర్వాత..

సాంకేతిక లోపం లేదా భారీ ట్రాఫిక్ కారణంగా ఇలా జరిగి ఉండవచ్చని నిపుణులు అంచనా వేశారు. ఉత్కంఠకు తెరదించుతూ.. దాదాపు ఆరు గంటల తర్వాత విరాట్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తిరిగి పునరుద్ధరించబడింది. ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోయినా, ఖాతా మళ్లీ కనిపించడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఒక వ్యక్తి సోషల్ మీడియా ఖాతా కొన్ని గంటలు కనిపించకపోతే ప్రపంచం మొత్తం గమనించిందంటే.. కోహ్లీ క్రేజ్ ఏ స్థాయిదో అర్థం చేసుకోవచ్చని విశ్లేషకులు అంటున్నారు.

# ముంబై 'మహారాణి' పోరాటం వృథా

### హర్మన్‌ప్రీత్ (82) వీరోచిత ఇన్నింగ్స్ వృథా.. 11 పరుగుల తేడాతో గుజరాత్ జెయింట్స్ విజయం

### టైటిల్ రేసులో ముంబైకి గండం.. ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకున్న గుజరాత్



ఎలిమినేటర్‌కు గుజరాత్

ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన గార్డ్నర్, వరేహామ్

**వడోదర, జనవరి 30:** ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్‌కు గట్టి షాక్ తగిలింది. శుక్రవారం వడోదర వేదికగా జరిగిన కీలక పోరులో గుజరాత్ జెయింట్స్ 11 పరుగుల తేడాతో ముంబైని ఓడించి ప్లేఆఫ్స్ (ఎలిమినేటర్) బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఈ విజయంతో గుజరాత్ జెయింట్స్ పాయింట్ల పట్టికలో రెండో స్థానాన్ని పదిలం చేసుకోగా, ముంబై ఇండియన్స్ భవితవ్యం ఇప్పుడు ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడి ఉంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఒంటరి పోరాటం చేసినప్పటికీ ముంబైని గెలిపించలేకపోయింది.

#### గార్డ్నర్, వరేహామ్ మెరుపులు..

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. ఆరంభంలో ఓపెనర్ బెత్ మూనీ (5) నిరాశపరిచినా, అనుష్క శర్మ (33 బంతుల్లో 33), సోఫీ డివైన్ (25) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. అయితే అసలైన విధ్వంసం చివర్లో జరిగింది. కెప్టెన్ ఆష్లే గార్డ్నర్ (28 బంతుల్లో 46; 7 ఫోర్లు, 1 సిక్స్), జార్జియా వరేహామ్ (26 బంతుల్లో 44 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) ముంబై బౌలర్లపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా చివరి 5 ఓవర్లలో గుజరాత్ ఏకంగా 61 పరుగులు రాబట్టింది. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 71 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

#### ఒంటరి పోరాటం చేసిన హర్మన్‌ప్రీత్..

168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఓపెనర్ హేలీ మాథ్యూస్ (6), నాట్ సీవర్-బ్రంట్ (2) విఫలమయ్యారు. ఈ దశలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (48 బంతుల్లో 82 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్సర్లు) అద్భుత ఇన్నింగ్స్ ఆడింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా.. మరోవైపు సిక్సర్లతో విరుచుకుపడింది. కానీ ఆమెకు మిగతా బ్యాటర్ల నుంచి సరైన సహకారం లభించలేదు. చివరికి ముంబై 20 ఓవర్లలో 7 వికెట్లకు 156 పరుగులు మాత్రమే చేయగలిగింది.

#### గుజరాత్ బౌలర్ల మాయాజాలం..

గుజరాత్ బౌలర్లలో సోఫీ డివైన్, జార్జియా వరేహామ్ తలో రెండు వికెట్లు తీసి ముంబై నడ్డి విరిచారు. అటు బ్యాటింగ్‌లోనూ, ఇటు బౌలింగ్‌లోనూ రాణించిన జార్జియా వరేహామ్, గార్డ్నర్ గుజరాత్ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ గెలుపుతో గుజరాత్ జెయింట్స్ ఎలిమినేటర్ రౌండ్‌కు అర్హత సాధించగా, ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్ ఆశలు ఆదివారం జరిగే ఢిల్లీ క్యాపిటల్స్ వర్సెస్ యూపీ వారియర్స్ మ్యాచ్ ఫలితంపై ఆధారపడి ఉన్నాయి.

## దాయాదుల పోరుపై ఉత్కంఠ.. లంకలో హై అలర్ట్!

**స్పోర్ట్స్ డెస్క్, జనవరి 31:** ప్రస్తుతం టీమిండియా న్యూజిలాండ్‌తో, పాకిస్థాన్ ఆస్ట్రేలియాతో సిరీస్‌లు ఆడుతున్నా.. ప్రపంచ క్రికెట్ అభిమానుల చూపు మాత్రం ఫిబ్రవరిలో జరగబోయే టీ20 ప్రపంచకప్ పైనే ఉంది. ముఖ్యంగా ఫిబ్రవరి 15న శ్రీలంక వేదికగా జరగనున్న భారత్-పాకిస్థాన్ మ్యాచ్ కోసం సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే రాజకీయ ఉద్రిక్తతలు, ఇరు దేశాల మధ్య మాటల యుద్ధం నేపథ్యంలో ఈ మ్యాచ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ మ్యాచ్ నిర్వహణను శ్రీలంక ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. భారత్-పాక్ మ్యాచ్ సెన్సిటివిటీని, ఆటగాళ్ళ భద్రతను దృష్టిలో ఉంచుకుని శ్రీలంక అధికారులు 'హైయెస్ట్ ప్రయారిటీ' సెక్యూరిటీని ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు లంక క్రీడాశాఖ మంత్రి సునీల్ కుమార గమాగే కీలక ప్రకటన చేశారు. రెండు జట్లకు రక్షణ కల్పించేందుకు 'ఎలైట్ కమాండో' యూనిట్లను మోహరిస్తున్నట్లు తెలిపారు. జట్లు ఎయిర్‌పోర్ట్‌లో దిగిన క్షణం నుంచి.. తిరిగి దేశం విడిచి వెళ్లే వరకు 24 గంటల పాటు ఆర్మ్డ్ ప్రొటెక్షన్‌లో ఉంటారని స్పష్టం చేశారు.

#### బంగ్లా అవుట్.. స్కాట్లాండ్ ఇన్

మరోవైపు ఈ ప్రపంచకప్ నుంచి బంగ్లాదేశ్ పూర్తిగా తప్పుకోవడం చర్చనీయాంశమైంది. తమ మ్యాచ్‌లను ఇండియాలో కాకుండా శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కోరగా.. చివరి నిమిషంలో వేదికల మార్పు కుదరదని ఐసీసీ తేల్చిచెప్పింది. కో-హోస్ట్ అయిన శ్రీలంక కూడా గ్రూప్ మార్పుకు అంగీకరించలేదు. దీంతో బంగ్లాదేశ్ టోర్నీ నుంచి వైదొలగగా.. ఆ స్థానంలో స్కాట్లాండ్ జట్టుకు అవకాశం దక్కింది.

బంగ్లాదేశ్ వైదొలగడాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (గ్రజదీ) సీరియస్‌గా తీసుకుంది. బంగ్లాకు బహిరంగ మద్దతు ప్రకటించిన పాక్.. ఐసీసీ తీరుపై అసంతృప్తితో ఉంది. ఈ క్రమంలోనే భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేసే ఆలోచనలో పాకిస్థాన్ ఉన్నట్లు 'టెలికాం ఆసియా స్పోర్ట్' నివేదిక వెల్లడించింది.



- తొలి పోరులోనే భారత్‌తో ఢీ.. ముంబై వేదికగా బిగ్ ఫైట్
- ప్రతిభ ఆధారంగానే ఎంపిక: ఐసీసీ పర్యవేక్షణలో జట్టు ప్రకటన

# టీ20 ప్రపంచకప్‌కు అమెరికా సై.. కెప్టెన్‌గా మనోడే!

### పాత జట్టుపైనే నమ్మకం.. 10 మందికి మళ్లీ ఛాన్స్

**స్పోర్ట్స్ డెస్క్, జనవరి 31 :** మరో వారం రోజుల్లో (ఫిబ్రవరి 7 నుంచి) భారత్, శ్రీలంక వేదికలుగా ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్ సమరానికి అగ్రరాజ్యం అమెరికా (ఖూూ) సిద్ధమైంది. మరోసారి ప్రపంచ వేదికపై సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్న యూఎస్ఏ.. తాజాగా తమ జట్టును ప్రకటించింది. విశేషమేమిటంటే.. గత ప్రపంచకప్‌లో ఆడిన వారిలో ఏకంగా 10 మందికి ఈసారి కూడా చోటు కల్పించి, అనుభవానికే పెద్దపీట వేసింది.

#### సారథిగా గుజరాతీ బిడ్డ..

అమెరికా జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైన మోనాంక్ పటేల్ భారతీయ సంతతికి చెందిన వ్యక్తి కావడం గమనార్హం. గుజరాత్‌లో జన్మించిన మోనాంక్.. 2019లో వికెట్ కీపర్‌గా అమెరికా జట్టులో అరంగేట్రం చేశారు. అప్పటి నుంచి జట్టు వృద్ధిలో కీలక పాత్ర పోషించారు. 2024 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై సంచలన విజయం సాధించి, జట్టును సూపర్-8 దశకు చేర్చడంలో ఆయన నాయకత్వం కీలకం.

#### తొలి మ్యాచ్‌లోనే అగ్నిపరీక్ష

ఈ ప్రపంచకప్‌లో అమెరికాకు ఆరంభమే అగ్నిపరీక్ష ఎదురుకానుంది. ముంబై వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లోనే ఆతిథ్య దేశం, డిఫెండింగ్ ఛాంపియన్ అయిన టీమిండియాతో అమెరికా తలపడనుంది. గత ఏడాది పాక్‌కు షాకిచ్చిన అమెరికా.. ఈసారి సొంతగడ్డపై భారత్‌ను ఎలా ఎదుర్కొంటుందనేది ఆసక్తికరంగా మారింది.

#### నిషేధం నీడలో.. పకడ్బందీ ఎంపిక

ఐసీసీ నిబంధనల ఉల్లంఘన కారణంగా గత సెప్టెంబర్‌లో యూఎస్ఏ క్రికెట్‌పై సస్పెన్షన్ వేటు పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జట్టు ఎంపికపై ఐసీసీ, యూఎస్ ఒలింపిక్ కమిటీ ప్రత్యేక దృష్టి సారించాయి. ఎలాంటి స్వార్థ ప్రయోజనాలకు తావులేకుండా, కేవలం ప్రతిభ ఆధారంగానే పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.



#### అమెరికా జట్టు వివరాలు

మోనాంక్ పటేల్ (కెప్టెన్), జెస్సీ సింగ్ (వైస్ కెప్టెన్), ఆండ్రీస్ గౌస్, షెహన్ జయసూర్య, మిలింద్ కుమార్, షయన్ జహంగీర్, సాయితేజ ముక్కామల, సంజయ్ కృష్ణమూర్తి, హర్మీత్ సింగ్, నోస్తుష్ కెంజిగే, షాడ్లీ వాన్ షాల్క్‌విక్, సౌరభ్ నేత్రవల్కర్, మహ్మద్ మొహసిన్, శుభమ్ రంజనే తదితరులు.

# ప్రతి ఇంట్లో కనిపించే కథ..
# ‘ఓం శాంతి శాంతి శాంతిః’



‘ఓం శాంతి శాంతి శాంతిః’ మలయాళంలో విజయవంతమైన ’జయ జయ జయ జయహేకి రీమేక్ ఇది.


బాగా చదువుకోవాలని, మంచి ఉద్యోగం చేయాలనీ భవిష్యత్తు గురించి చిన్నప్పట్నుంచీ ఎన్నో కలలు కన్న ఓ సగటు యువతి ప్రశాంతి అలియాస్ శాంతి (ఈషా రెబ్బా). కళాశాలలో జరిగిన ఓ సంఘటనతో చదువును అర్ధాంతరంగా ఆపేసి పెళ్లికి తలూపాల్సి వస్తుంది. కట్టుకున్న అమ్మాయిని తాను చదివిస్తానని మాట ఇచ్చి మరీ శాంతిని పెళ్లి చేసుకుంటాడు చేపల వ్యాపారి ఓంకార్ నాయుడు (తరుణ్ భాస్కర్). పెళ్లి తర్వాతైనా చదువుకోవచ్చనే సంతోషంతో నాయుడుతో కలిసి ఏడడుగులు వేస్తుంది. కానీ, ఆమె ఊహించింది ఒకటి, పెళ్లి తర్వాత జరిగింది మరొకటి. భర్త అనే అహంకారంతో తన కోపాన్నంతా భార్య శాంతిపై ప్రదర్శిస్తుంటాడు ఓంకార్. ఆయనకు కోపం వచ్చిందంటే భార్య చెంప పగిలిపోవల్సిందే. ఇదే విషయాన్ని కన్నవాళ్లతో చెబితే సర్దుకుపోవాలంటూ చెబుతారు. రోజు రోజుకీ భర్త పెట్టే హింస శ్రుతిమించడంతో ఒక రోజు శాంతి ఎదురు తిరుగుతుంది. తానూ చేయి చేసుకోగలననీ భర్తకు బాగా తెలిసేలా చేస్తుంది. దాంతో కంగుతిన్న ఓంకార్ ఏం చేశాడు? ఆ తర్వాత భార్యాభర్తల మధ్య యుద్ధం ఎలా సాగింది? ఇద్దరూ విడిపోయారా? లేదా? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే. భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రతి ఇంటినీ ఆలోచింపజేసే బలమైన కథ ఇది. ప్రతి అమ్మాయి, ప్రతి మహిళ తనని తాను చూసుకునే శాంతి పాత్ర ఇందులో ఉంది. ఓంకార్ నాయుడులా అహంకారం, ఆవేశంతో భార్యలపై చేయి చేసుకున్న మగాళ్లు ఈ సినిమా చూస్తున్నప్పుడు చాలామందే గుర్తుకొస్తారు. గోదావరి నేపథ్యాన్ని జోడించడమే ఈ సినిమాని ప్రత్యేకంగా నిలబెట్టింది. తెలుగుదనం ఉట్టిపడే పాత్రలు, గోదావరి యాస ఈ సినిమాని సొంతం చేసుకునేలా చేస్తాయి. అచ్చమైన గోదావరి ప్రాంతం నేపథ్యాన్ని ఆవిష్కరించే ప్రథమార్ధం ఈ సినిమాకి బలం. కట్టుబాట్ల పేరుతో అమ్మాయిల స్వేచ్ఛని, వాళ్ల హక్కుల్ని హరించి వేస్తున్నామని చెప్పకనే చెబుతాయి ఆ సన్నివేశాలు. ఓంకార్ నాయుడు పాత్ర పరిచయం తర్వాత సన్నివేశాలు సరదా సరదాగా మారిపోతాయి. బ్రహ్మాజీ నేపథ్యంలోని సన్నివేశాలు మరింత సందడిగా సాగుతాయి. శాంతి పాత్ర మెట్టినింట్లోకి అడుగుపెట్టాక అక్కడ ఆమెకి ఎదురయ్యే పరిణామాలు చాలా ఇళ్లల్లో చోటు చేసుకునే గృహ హింసకు అద్దం పట్టేలా ఉంటాయి. శాంతి ఎదురు తిరగడంతోనే కథ మలుపు తిరుగుతుంది. అక్కడ మొదలైన భార్యాభర్తల మధ్య యుద్ధం ఎక్కడ ముగిసిందన్నదే మిగతా సినిమా. ద్వితీయార్ధం తర్వాత ఆ ఇద్దరి మధ్య సాగే కొన్ని సన్నివేశాలు పునరావృతం అయినట్టుగా అనిపిస్తాయి. ఓంకార్ నాయుడు పాత్రలో తరుణ్ భాస్కర్ ఒదిగిపోయిన తీరు మెప్పిస్తుంది. ఆయన గోదావరి యాస పలికిన విధానం కూడా బాగుంది. భార్య తిరగబడేంత వరకూ ఒకలా కనిపించిన తరుణ్, భార్య చేతిలో తన్నులు తినప్పట్నుంచి ఆయన ప్రదర్శించిన నటన, హావభావాలు మరో స్థాయిలో ఉంటాయి. శాంతి పాత్రలో ఈషా రెబ్బా నటన ఈ సినిమాకి హైలైట్. ప్రథమార్ధంలో కళ్లతోనే భావాలు పలికిస్తూ పాత్రని పండించింది. భర్తని ఎదిరిస్తూ చేసే యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకుల్ని అలరించేలా ఉంటాయి. బ్రహ్మాజీతోపాటు ఇతర నటులు పాత్రల పరిధి మేరకు మంచి అభినయం ప్రదర్శించారు. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. దర్శకుడు గోదావరి నేపథ్యాన్ని తెరపై చూపిస్తూ కథని చెప్పిన తీరు, నందకిశోర్ సంభాషణలు ఆకట్టుకునేలా ఉంటాయి.

# అమెజాన్‌లోకి వస్తున్న నారీ నారీ నడుమ మురారి’

సంక్రాంతి కానుకగా విడుదలై, విజయం అందుకున్న కామెడీ ఎంటర్‌టైనర్ మూవీ ’నారీ నారీ నడుమ మురారి’ ఓటీటీ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. ’అమెజాన్ ప్రైమ్ వీడియో’లో ఫిబ్రవరి 4 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు కన్నడ, తమిళం, మలయాళం, హిందీలోనూ ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతుందని సదరు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. సంక్రాంతి బరిలోకి చివరిగా వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. ఇద్దరమ్మాయిల మధ్య నగిలిపోయే వ్యక్తిగా హీరో శర్వానంద్ , హీరోయిన్లుగా సాక్షి వైద్య, సంయుక్త ఆకట్టుకున్నారు. సీనియర్ నటుడు నరేశ్, సత్య, సునీల్, వెన్నెల కిశోర్ తమ మార్క్ కామెడీతో అలరించారు. వినోదాత్మక కథలపై తనకెంత పట్టుందో దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ సినిమాతో మరోసారి నిరూపించారు. బీటెక్ చేసి ఆర్కిటెక్ట్‌గా పని చేస్తున్న కుర్రాడు గౌతమ్ (శర్వానంద్). నిత్య (సాక్షి వైద్య)తో ప్రేమలో ఉన్న తను.. ఇంట్లో వాళ్లను ఒప్పించి పెళ్లి పీటలెక్కాలని అనుకుంటాడు. ఈ పెళ్లికి తొలుత నిత్య తండ్రి రామలింగం (సంపత్ రాజ్) అడ్డు చెప్పినా.. తర్వాత అంగీకరిస్తాడు. ఆ పెళ్లి రిజిస్టర్ ఆఫీస్‌లో జరగాలని షరతు పెడతాడు. తప్పని పరిస్థితుల్లో దీనికి గౌతమ్ ఓకే అంటాడు. అలా పెళ్లికి దరఖాస్తు చేసుకున్నాక గౌతమ్‌కు ఓ అనుకోని చిక్కు ఎదురవుతుంది. దానికి, కాలేజీలో ప్రేమించిన దియా (సంయుక్త)కు ఉన్న సంబంధం ఏంటి? అసలు వాళ్లిద్దరూ ఎందుకు విడిపోవాల్సి వచ్చింది? ఈ రెండు ప్రేమకథల వల్ల గౌతమ్ తండ్రి కార్తీక్ (నరేశ్) – పిన్ని పల్లవి (సిరి హనుమంతు)ల దాంపత్య జీవితం విడాకుల దాకా ఎందుకు వెళ్లింది? అన్నది మిగతా కథ.





# తెల్ల చీరలో హీట్ పుట్టిస్తున్న అనైరా గుప్తా

ఇండియన్ సినిమాల్లో క్రమంగా గుర్తింపు పెంచుకుంటున్న నటి, మోడల్ అనైరా గుప్తా మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తాజాగా షేర్ చేసిన ఫోటోకు మంచి స్పందన లభిస్తోంది. తెల్ల చీరకు ఎరుపు ప్రింటెడ్ బ్లౌజ్‌ను జోడించిన లుక్‌లో అనైరా ఆకట్టుకుంటోంది. తమిళ, తెలుగు చిత్రాల్లో నటిస్తూ అనైరా తనదైన గుర్తింపును ఏర్పరుచుకుంది. థలపతి విజయ్‌తో కలిసి నటించిన ‘సర్కార్’ చిత్రం ఆమెకు విస్తృత గుర్తింపు తీసుకొచ్చింది. అలాగే ‘వితైక్కారన్’ తమిళ సినిమాలోనూ ఆమె నటన ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. తెలుగులో ‘అన్వేషి’తో మెప్పించిన అనైరా, తాజాగా హరీష్ గాథగాని దర్శకత్వంలో తెరకెక్కిన రొమాంటిక్ లవ్ స్టోరీ ‘హవీఎ’లోనూ నటించింది. సినిమాలతో పాటు, 2026లో విడుదలైన ‘మజా లే లే’ మ్యూజిక్ వీడియోలో పూనమ్ ఝా, దేవ్ నేగితో కలిసి కనిపించి మరోసారి వార్తల్లో నిలిచింది.

# రజనీ, కమల్ మల్టీస్టారర్ మూవీ

## జైలర్ డైరెక్టర్ చేతికి ప్రాజెక్ట్ ?



ఇండియన్ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లిన పాన్ ఇండియా చిత్రాలు, సీక్వెల్స్, ప్రీక్వెల్స్ హవా కొనసాగుతూనే ఉంది. ఇదే క్రమంలో మల్టీస్టారర్ సినిమాలపై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యంగా టాప్ స్టార్స్ కలిసి కనిపిస్తే ఆ సినిమా రిలీజ్‌కు ముందే భారీ హైప్ క్రియేట్ అవుతోంది. అలాంటి క్రేజీ కాంబినేషన్‌లో ఒకటిగా సూపర్ స్టార్ రజినీకాంత్ మరియు యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ కలిసి నటించే సినిమా గత కొన్నాళ్ల క్రితం ఒక్కసారిగా సెన్సేషన్‌గా మారిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ ఇద్దరు లెజెండరీ నటులు కలిసి కనిపించే ఒక ప్రాజెక్ట్ కమల్ హాసన్ నిర్మాణంలో ఉందన్న వార్తలు ఉన్నప్పటికీ, అది కాకుండా మరోసారి వీరి కలయికలో కొత్త సినిమా రాబోతుందన్న ప్రచారం ఇప్పుడు తమిళ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా వినిపిస్తున్న బజ్ ప్రకారం, ఈ భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌ను ’జైలర్’ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ టేకోవర్ చేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఈ వార్తలకు మరింత బలం చేకూర్చేలా, నెల్సన్ ఇప్పటికే రజినీకాంత్ ? కమల్ హాసన్ కలయికపై ఒక అనౌన్స్‌మెంట్ కట్ లేదా కాన్సెప్ట్ వీడియో తరహా విజువల్‌ను సిద్ధం చేస్తున్నాడన్న రూమర్స్ కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ వెంటనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశం మాత్రం తక్కువగా ఉందని సమాచారం. ప్రస్తుతం నెల్సన్ ’జైలర్ 2’తో పాటు ఇతర కమిట్‌మెంట్స్‌లో బిజీగా ఉండగా, తెలుగులో కూడా ఒక సినిమా చేయాల్సి ఉన్నట్టు తెలుస్తోంది. ఆ ప్రాజెక్ట్ పూర్తి అయిన తర్వాతే ఈ భారీ మల్టీస్టారర్‌పై దృష్టి పెట్టే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. రజినీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే అది కేవలం సినిమా మాత్రమే కాకుండా ఒక చరిత్రగా నిలుస్తుందన్న అభిప్రాయం అభిమానుల్లో ఉంది. అందుకే ఈ ప్రాజెక్ట్‌పై వస్తున్న ప్రతి చిన్న వార్త కూడా భారీ చర్చకు దారి తీస్తోంది.

# పల్నాడు నేపథ్యంలో భగవంతుడు మూవీ



టాలీవుడ్ యువ నటుడు తిరువీర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం ’భగవంతుడు’. పల్నాడు నేపథ్యంలో ఈ సినిమా రాబోతుండగా.. తాజాగా చిత్ర యూనిట్ టీజర్‌ను విడుదల చేసింది.పల్లెటూరి నేపథ్యంలో సాగే పీరియడ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం టీజర్‌లో చూపించిన విజువల్స్ మరియు తిరువీర్ పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ సినిమాపై భారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మసూద, ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో వంటి చిత్రాలతో నటుడిగా తన సత్తా చాటిన తిరువీర్ ఇందులో మరో విభిన్నమైన మరియు భావోద్వేగపూరితమైన పాత్రలో కనిపించబోతున్నాడు. జీజీ విహారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రవి పనస ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్‌పై రవి పనస నిర్మిస్తుండగా ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తోంది. రిషి నాగరాజు, కాలకేయ ప్రభాకర్, రవీంద్ర విజయ్, మురళిధర్ గౌడ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం తెలుగుతో పాటు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కాబోతుంది.

# జియో హాట్‌స్టార్‌లోకి 6న వస్తున్న రాజాసాబ్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో వచ్చిన ఫాంటసీ హారర్ కామెడీ చిత్రం ’ది రాజాసాబ్’. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జియో హాట్‌స్టార్ వేదికగా ఫిబ్రవరి 6 నుంచి స్ట్రీమింగ్ కానుంది. దేవనగర సంస్థానానికి ఒకప్పుడు జమిందారు గంగాదేవి (జరీనా వహాబ్). అంత గొప్ప నేపథ్యమున్నా తన మనవడు రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)తో కలిసి గంగమ్మగా సాధారణ జీవితం గడుపుతుంటుంది. తన నాన్నమ్మ అంటే రాజుకు ప్రాణం. వయసు ప్రభావం కారణంగా మతిమరుపు సమస్యలతో బాధపడుతూ ఉంటుంది గంగమ్మ. తనకు సంబంధించిన చాలా విషయాల్ని మరిచిపోయినా తన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం మరిచిపోదు. తనకు కలలో కనిపిస్తున్న తాతని ఎలాగైనా వెతికి తీసుకురమ్మని రాజాసాబ్‌ని కోరుతుంది. కానీ, కనకరాజే తనకున్న రకరకాల విద్యలతో నాన్నమ్మ, మనవడిని నర్సాపూర్ అడవిలోని రాజమహల్‌కి వచ్చేలా చేస్తాడు. ఒక దశలో ఇద్దరినీ చంపేయాలని కూడా అనుకుంటాడు. మార్మిక విద్యలెన్నో తెలిసిన కనకరాజుని రాజాసాబ్ ఎలా ఎదుర్కొన్నాడు? అసలు కనకరాజు గతమేమిటి?అతని లక్ష్యమేమిటి? రాజాసాబ్ జీవితంలోకి వచ్చిన ముగ్గురమ్మాయిలు భైరవి (మాళవిక మోహనన్), ÷–లబెస్సీ (నిధి అగర్వాల్) అనిత (రిద్ధి కుమార్) ఎవరు? తదితర విషయాలను సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.




Printed, Published and Owned by SHAIK FAREED, and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: SHAIK FAREED. RNI NO : TGTEL/25/A1737 Email: netisakshinews@gmail.com. Phone No: 9119949944, 9666052221

## భాషాభిరుచి పెంపొందించాలి

**అబ్దుల్ హమీద్**



**నేటి సాక్షి - మేడిపల్లి:** విద్యార్థుల్లో భాషాభిరుచి పెంపొందించాలని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సముదాయం ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ హమీద్ కోరారు. తెలుగు భాష ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేయాల్సిన బాధ్యత పండితులపై ఉందన్నారు. సమావేశంలో రిసోర్స్ పర్సన్స్ చెరుకు మహేశ్వర శర్మ, మోతుకుల నారాయణ గౌడ్‌లు బోధనా వ్యూహాలపై చర్చించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీపీఎం అభ్యర్థిగా బోండ్ల సరిత



**నేటి సాక్షి, మంచిర్యాల :** చెన్నూరు మున్సిపాలిటీ 16వ వార్డు సీపీఎం అభ్యర్థిగా బోండ్ల సరిత నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ కార్మిక, రైతు, కూలీల సమస్యల పరిష్కారానికి పార్టీ నిరంతరం పోరాడుతుందని అన్నారు. 16వ వార్డు ప్రజలు సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

## మారేడు ఆకుపై సమ్మక్క-సారక్క

**ప్రతిరూపం చిత్రీకరించిన గుండేటి రాజు**



**నేటి సాక్షి - జగిత్యాల:** జగిత్యాల జిల్లాకు చెందిన చిత్రకారుడు కళాశ్రీ గుండేటి రాజు మారేడు ఆకుపై సమ్మక్క-సారక్క అమ్మవార్ల ప్రతిమలను చిత్రీకరించి అందరి ప్రశంసలు అందుకున్నారు. జాతర సందర్భంగా అమ్మవార్లపై భక్తితో ఈ అపురూప కళాఖండాన్ని రూపొందించి భక్తులను అబ్బురపరిచారు. ఆయన కుంచె నుంచి జాలువారిన ఈ చిత్రాన్ని చూసిన జిల్లా వాసులు గుండేటి రాజును అభినందించారు.

## ఎన్నికలనియమావళిని పాటించాలి

**అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్**



**నేటి సాక్షి, రాయికల్ (ఇమ్మడి విజయ్ కుమార్):** రాయికల్ మున్సిపాలిటీలో జరుగుతున్న నామినేషన్ ప్రక్రియను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ పరిశీలించారు. నామినేషన్ కేంద్రాలు, ఫారాలు, రిజిస్టర్లను తనిఖీ చేసి ఆయా వార్డుల నామినేషన్ల వివరాలను తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, అభ్యర్థుల ప్రకటన వంటి ప్రక్రియలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ల వివరాలను రోజువారీగా టీ-పోల్ యాప్‌లోఅప్‌లోడ్ చేయాలని, అభ్యర్థులకు హెల్ప్‌డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలను పక్కాగా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు

## జాతీయ భావాలుపెంపొందుతాయి

**బోగ రమేష్**



**నేటి సాక్షి, రాయికల్ (ఇమ్మడి విజయ్ కుమార్):** జాతీయ భాష హిందీ ద్వారా విద్యార్థుల్లో జాతీయభావాలు పెంపొందుతాయని తాట్లావాయి కాంప్లెక్స్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బోగ రమేష్ అన్నారు. జడ్పీహెచ్ఎస్ తాట్లావాయి పాఠశాలలో నిర్వహించిన హిందీ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హిందీ దేశవ్యాప్త ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఆరవ తరగతి నుంచే హిందీ బలంగా నేర్పితే విద్యార్థులు ఉన్నత తరగతుల్లో స్పష్టంగా చదివే స్థాయికి చేరుకుంటారని సూచించారు. సమావేశంలో పలువురు హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీ.ఎం.కప్ క్రీడల ప్రారంభం



**నేటి సాక్షి - రాయికల్ ( ఇమ్మడి విజయ్ కుమార్ ) :** అల్లీపూర్ గ్రామంలో రాయికల్ రూరల్ మండల స్థాయి సి.ఏం.కప్ క్రీడలను శుక్రవారం ఎంపిడీవో చిరంజీవి ప్రారంభించారు. దీనిలో భాగంగా వాలీ బాల్,కబడ్డీ, ఖో,ఖో, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సి.ఎం.కప్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి మన మండలం జిల్లా స్థాయిలో బహుమతులు సాధించి రాష్ట్ర స్థాయిలో పాల్గొనాలని అన్నారు. అనంతరం ఎంపివో సుష్మ మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసికోల్లసం శారీరక దృఢత్వం పెంపొందిందని అన్నారు. అల్లీపూర్ గ్రామ సర్పంచ్ ఎంబరీ సుష్మ మాట్లాడుతు క్రీడలు ఆడడం ద్వారా విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో. రాఘవులు, గ్రామ సెక్రటరీ శేఖర్, సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాస్,పిడిలు కృష్ణప్రసాద్, రాజగోపాల్, సుజాత, ప్రతాప్, గంగాధర్, సుప్రియలు పాల్గొన్నారు.

## జలాల్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద రూ.4.17 లక్షల నగదు పట్టివేత



**నేటి సాక్షి, నారాయణపేట, (ఇమామ్ సాబ్):** మున్సిపాలిటీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జలాల్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద ఫ్లయింగ్ స్కాడ్ టీం వాహనాల తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీలలో యాదగిరి నుంచి నారాయణపేటకు వస్తున్న మహమ్మద్ యూనస్ వద్ద రూ.2,17,200 నగదు, అలాగే కర్నాటక నుంచి నారాయణపేట (అశోక్ నగర్)కు వస్తున్న నాగిరెడ్డి వద్ద రూ.2,00,000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.4,17,200 నగదును పట్టుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును తదుపరి చర్యల నిమిత్తం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని నగదు గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు మరింత కఠినంగా కొనసాగుతాయని, ప్రజలు నగదు, మద్యం తదితర విలువైన వస్తువులు అక్రమంగా తరలించవద్దని ఎస్ఐ హెచ్చరించారు.


## రోడ్డు భద్రత మాస వారోత్సవాలు 2026

- **వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతుల ప్రదానం**

**నేటి సాక్షి - జగిత్యాల (పూరెళ్ల బాపు):** రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన రోడ్డు భద్రత మాస వారోత్సవాలు-2026 కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయిలో వ్యాసరచన పోటీని నిర్వహించారు. ఈ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రోడ్డు భద్రత యొక్క ప్రాముఖ్యతను తమ వ్యాసాల ద్వారా చక్కగా వివరించారు. ఈ పోటీలో జిల్లా కేంద్రం లోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు డి.మోక్ష ప్రథమ బహుమతిని, ఎస్.శ్రీనిధి ద్వితీయ బహుమతిని సాధించారు. విజేతలకు జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు ప్రమీల, అభిలాష్, రియాజ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. విద్యార్థులలో ఇలాంటి పోటీలు నిర్వహించడం ద్వారా చిన్న వయస్సు నుంచే భద్రతపై అవగాహన పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరెస్పాండెంట్ రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు రవాణాశాఖ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ప్రజల సొమ్మును దోచుకున్న కేసీఆర్‌ను నిలదీయాలి



**నేటి సాక్షి గజ్వేల్ :** పేద ప్రజల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని, ప్రజల సొమ్మును అప్పనంగా మేస్తున్న గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్‌ను ప్రజలు నిలదీయాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం గజ్వేల్‌లో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు బీఫాంలు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జీతభత్యాల కోసమే కేసీఆర్ ఎమ్మెల్యే పదవిని పట్టుకొని వేలాడుతున్నారని, ఎన్నికల ప్రచారానికి వచ్చే బీఆర్ఎస్ పార్టీ నేతలను ప్రజలు ప్రశ్నించాలని నర్సారెడ్డి సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతిచ్చిన అభ్యర్థులను గెలిపిస్తేనే గజ్వేల్ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. గత పదేళ్లుగా గజ్వేల్ నియోజకవర్గ సమస్యలను కేసీఆర్ పూర్తిగా పట్టించుకోలేదని విమర్శించారు. సిద్ధిపేట అభివృద్ధి పేరుతో గజ్వేల్ ప్రజలను మోసం చేశారని, ఈ ప్రాంత నాయకులపై నమ్మకం లేకనే ప్రాంతేతరుల పెత్తనం కొనసాగుతోందని ఆరోపించారు. ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో భూములు కోల్పోయిన నిర్వాసితుల ఉసురు తప్పక తగులుతుందని హెచ్చరించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి కావాల్సినన్ని నిధులు కేటాయిస్తున్నారని, ముంపు బాధితుల సమస్యల పరిష్కారం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని నర్సారెడ్డి

- **పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం: తుంకుంట నర్సారెడ్డి**

తెలిపారు. మున్సిపల్ పరిధిలో రోడ్లు అధ్వాన్న స్థితిలో ఉండగా, సమాచారం అందగానే సీఎం రేవంత్ రెడ్డి వెంటనే నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తుండటంతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ వంటి ప్రజాహిత కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు మద్దతుగా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. గజ్వేల్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని, పేదల అభ్యున్నతికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని తుంకుంట నర్సారెడ్డి స్పష్టం చేశారు.

## ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు...

- **నాయకుల ఘన నివాళులు...**

**నేటి సాక్షి, నారాయణపేట ( ఇమామ్ సాబ్:** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ముందు ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం సత్యం, అహింసను ఆయుధాలుగా మలుచుకుని భారత జాతిని ఏకత్రాటిపై నిలిపి స్వాతంత్రాన్ని సాధించిన జాతిపిత, మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా మరికల్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మరికల్ గ్రామ సర్పంచ్ గూప.చెన్నయ్య మరికల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాటేకొండ ఆంజనేయులు, మరికల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరీష్ కుమార్, మరికల్ మండల కాంగ్రెస్ నాయకులు జి.గోవర్ధన్, పోలేమోని రామకృష్ణ, జంగిడి రవి, బొంత మొగులయ్య, జి కుర్మయ్య, దండు ఎల్లప్ప, పి. శ్రీనివాసులు, సద్దాం, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.



## బోయకొండ గంగమ్మ సేవలో డి ఐ జి ప్రవీణ్ కుమార్









**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మను కర్నూలు రేంజ్ డీఐజీ ప్రవీణ్ కుమార్ దర్శించుకున్నారు .ఉప కమిషనర్ ఈవో ఏకాంబరం .తెలుగుదేశం పార్టీ నాయకులు మధుసూదనాయుడు గువ్వల రమేష్ రెడ్డిలు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించి మండపంలో వేద ఆశీర్వాదం అనంతరం పవిత్ర తీర్థ ప్రసాదాలు మెమెంటోతో సత్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చౌడేపల్లి పుంగనూరు సదుం సోమల అన్నమయ్య జిల్లాలోకి విలీనం అయినందున పర్యటిస్తున్నట్లు ఆయన తెలిపారు. శక్తి క్షేత్రం బోయకొండలో గట్టి బందోబస్తు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి డి.ఎస్.పి మహేంద్ర పుంగనూరు పుంగనూరు రూరల్ సిఐలు సుబ్బరాయుడు సాయి ప్రసాద్ ఎస్ఐ నాగేశ్వరరావు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆవుల రామచంద్రయ్య .పూల చంద్రమౌళి .అర్జున్ రాయల్ ప్రభాకర్ బోయకొండ సుబ్బు సోము రెడ్డి సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## ఉపాధ్యాయులకు 12వ పిఆర్సి కమిషన్ డిమాండ్

**నేటి సాక్షి - చౌడేపల్లి:** ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి 12వ పిఆర్సి కమిషన్ వెంటనే ఏర్పాటు చేసి 30% ఐఆర్ మంజూరు చేయాలని ఎస్టీయూయొక్క జిల్లా నాయకులు లింగమూర్తి, చౌడేపల్లి మండల అధ్యక్షులు వసంతమ్మ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం పిలుపుమేరకు శుక్రవారం తహసిల్దార్ పార్వతమ్మకు మెమరాండం అందజేశారు. ఫిబ్రవరి 10న జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నా, 25న విజయవాడలో చలో కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ఏవి సుబ్రహ్మణ్యం, తులసి నాగరాజ్, రామకృష్ణ, సుమిత్ర, నాగరత్నమ్మ, వెంకటస్వామి, మోహన్, ఇతరులు పాల్గొన్నారు.



# జగిత్యాల మున్సిపాలిటీల్లో నామినేషన్ల రద్దీ

- **కార్యకర్తల కోలాహలం మధ్య అభ్యర్థుల నామినేషన్ల దాఖలు**

**నేటి సాక్షి - జగిత్యాల (పూరెళ్ల బాపు):** జగిత్యాల జిల్లాలోని 5 జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్పల్లి, రాయికల్ మున్సీపాలిటిల్లో శుక్రవారం నామినేషన్ల చివరిరోజు పెద్ద సంఖ్యలో కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్. పార్టీలు, స్వతంత్రులు ఒక్కో వార్డు ఎక్కువ మంది ఆశావాహులు టిక్కెట్ కోసం తీవ్ర పోటీనెలకొనగా నాయకులు సమయమనం పాటిస్తూ కార్యకర్తలను బుజ్జగించే పనుల్లో తలమూనకలై ఉన్నారు.

జగిత్యాల మున్సిపల్ లో పరిస్థితి మరోలా ఉన్నది.ఎమ్మెల్యే, మాజీ మంత్రి మధ్య పచ్చగడ్డి వేస్తే బగ్గుమానేలా ఉండగ ఇక్కడ ఎవరికీ పార్టీ బీ ఫారాలు అధిష్టానం ఇస్తుందోనని ఆశవాహుల్లో తీవ్ర ఉత్కంట నెలకొన్నప్పటికీ పోటా పోటీగా అభ్యర్థులు నామినేషన్లు వేశారు. జగిత్యాల పట్టణంలోని 22 వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్తిగా చిట్ల అంజన్న,చిట్ల లతలు కాంగ్రెస్ పార్టీ అభిమానులు వెంటారాగా నామినేషన్లు దాఖలు చేశారు. జగిత్యాల మున్సిపల్ 48 వ వార్డు బిజెపి అభ్యర్థిగా కొండా అరుణ - లక్ష్మణ్‌లు పెద్ద ఎత్తున వార్డ్ ప్రజలు వెంటారాగ నామినేషన్ దాఖలు చేశారు. అరుణ ఇంటి నుండి ర్యాలీ గా బయలుదేరి టవర్ సర్కిల్ మీదుగా తహసిల్ చౌరస్తా , ఓల్డ్ బస్టాండ్ నుండి నామినేషన్ కేంద్రమైన మెప్మా కార్యాలయంలో కార్యకర్తల ఆనందోత్సాహాల మధ్య నామినేషన్ పత్రాలు అధికారులకు అందజేశారు. 26 వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్తిగా సిరిపురం ఉష్శ్రీ జితేందర్, ఇంకా వివిధ వార్డుల నుండి జంగిలి ఓంకార్, బద్దం లత జగన్మోహన్ రెడ్డి, పద్మ, మున్నా, డబ్బు అఖిల రెడ్డి, పిప్పరి



అనిత, బొల్లి శేఖర్,శివకేసరి బాబు, అల్లాల రమేష్ రావు, చెట్టే గంగాధర్, ధర్మేందర్, సమిండ్ల వాణి, కొక్కు గంగాధర్, తదితరులు నాయకులు, కార్యకర్తలు వెంటారాగా అభ్యర్థులు నామినేషన్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు.

# 28వ వార్డు బీజేపీ అభ్యర్థిగా ఈర్ల. విశ్వేశ్వర్ రావు.



**నేటి సాక్షి.కొమరం భీం ఆసిఫాబాద్ :** మున్సిపల్ ఎన్నికల తాటికి కాగజ్‌నగర్ రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఎన్నికల సమీకరణాలను మార్చే ప్రయత్నంగా బీజేపీ నేత మాజీ కౌన్సిలర్ ఈర్ల. విశ్వేశ్వర్‌రావు కౌన్సిలర్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. ప్రాంతీయ రాజకీయాలలో విశ్వేశ్వర్‌రావు ఇప్పటికే మూడు సార్లు కౌన్సిలర్‌గా సేవలందించిన అనుభవం కలిగి ఉండటం, తెలంగాణ ఉద్యమం నుంచి ప్రజాసేవలో చురుకుగా ఉన్న ఆయన స్థానికంగా మంచి పట్టున్న నాయకుడిగా

- **అభివృద్ధికి బాట.కమలం కు ఓటుతోనే సాధ్యం...**

పేరుగాంచారు. రోడ్ల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య కార్యక్రమాలపై గతంలో చేపట్టిన చర్యలు తమ సేవా పంథానికి నిదర్శనమని విశ్వేశ్వర్‌రావు పేర్కొన్నారు. తన అనుభవం అభివృద్ధిని మరింత వేగవంతం చేయగలదని, ప్రజల మద్దతు తనకు ప్రధాన బలం అని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# సమ్మక్క సారలమ్మ జాతరలో ప్రత్యేక పూజలు

- **మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ పాల్గొన్నారు**

**నేటి సాక్షి - చిలుకూరు:** చిలుకూరు మండలం మాధవ గూడెం గ్రామంలో శుక్రవారం ముగిసిన సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం, శుక్రవారం రెండు రోజులుగా భక్తులు అమ్మవారికి బోనాలు, మొక్కులు సమర్పించారు. జాతర సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీ ఓ. ముక్కపాటి నరసింహారావు, దేవాలయ ధర్మకర్తలు బుడిగం వీరభద్రయ్య, దాసరాజు తిరపయ్య, సర్పంచులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



# అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి



**నేటి సాక్షి, గన్నేరువరం,( బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా మానకొండూరు శాసనసభ్యులు టీపిసిసి ఎస్సి సెల్ చైర్ పర్సన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సమ్మక్క సారలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి గ్రామ శాఖ అధ్యక్షులు చింతల శ్రీధర్ రెడ్డి,జిల్లా నాయకులు కోమ్మెర రవీందర్ రెడ్డి, అనంతరెడ్డి ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాతంగి అనిల్, దేశరాజ్ అనిల్, సర్పంచ్ కటకం తిరుపతి, రాపోల్ నవీన్, వార్డు మెంబర్ విజేందర్, మార్గం మల్లేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి... అభివృద్ధికి బాటలు వేయండి





- **భారీ ఎత్తున బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్లు**
- **నామినేషన్ కార్యక్రమాల్లో పాల్గొన్న : మాజీ భాస్కర్ రావు, సిద్ధార్థ**

**నేటిసాక్షి, మిర్యాలగూడ:** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మిర్యాలగూడ పట్టణంలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, శుక్రవార భారీ ఎత్తున నామినేషన్ ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు, యువ నాయకులు నల్లమోతు సిద్ధార్థ, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు హాజరై, అభ్యర్థులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ, ప్రజలు అన్ని వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారితో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# కాషాయ జనసంద్రమైన జగిత్యాల వీధులు

**నేటి సాక్షి - జగిత్యాల:** జగిత్యాల మున్సిపల్ 48వ వార్డు కౌన్సిలర్ పదవికి బీజేపీ అభ్యర్థి కొండ అరుణ లక్ష్మణ్ శుక్రవారం తన నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. ఈ సందర్భంగా జగిత్యాల వీధులు కాషాయ రంగుతో నింపబడ్డాయి, వందలాది మద్దతుదారులు మరియు పార్టీ కార్యకర్తలు ఆమెతో చేరారు. అరుణ లక్ష్మణ్ మాట్లాడుతూ, జగిత్యాల అభివృద్ధి ఆమె ప్రధాన లక్ష్యమని, మున్సిపాలిటీని ప్రజల ఆశీస్సులతో ఆదర్శంగా తీర్చిదిద్దతారని ధీమా వ్యక్తం చేశారు.





# సమయపాలన తప్పనిసరి

**కలెక్టర్ కుమార్ దీపక్**



నేటి సాక్షి, మంచిర్యాల : మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణలో సమయపాలన కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. నస్పూర్‌లోని నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. సాయంత్రం 5 గంటలకు గేటు మూసివేసి, లోపల ఉన్న అభ్యర్థులకు టోకెన్లు ఇచ్చి వరుస క్రమంలో నామినేషన్లు స్వీకరించాలని ఆదేశించారు. హెల్ప్‌డెస్క్ ద్వారా అభ్యర్థులకు అవసరమైన సమాచారం అందించాలని తెలిపారు. 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 1న అభ్యంతరాల స్వీకరణ, 2న పరిష్కారం, 3న ఉపసంహరణ అనంతరం తుది జాబితా ప్రకటిస్తామని చెప్పారు. ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు.

# సాఫ్ట్‌బాల్ పోటీలకు నవదీప్

**నేటి సాక్షి - మేడిపల్లి:** భీమారం మండలం గోవిందారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన పిట్టల నవదీప్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి చేరుకున్నాడు. ఫిబ్రవరి 4నుంచి ఛత్తీస్‌గఢ్ బిలాస్పూర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాడని ఫిజికల్ డైరెక్టర్ ప్రశాంత్ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆస్ఫాక్ హుస్సేన్, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు నవదీప్‌ను అభినందించారు.



# సీఎంకప్ క్రీడోత్సవాలు ప్రారంభం



**నేటి సాక్షి - మేడిపల్లి:** మేడిపల్లి రెసిడెన్షియల్ పాఠశాలలో ఎంపీడీవో అంజుమ సీఎం కప్ మండల స్థాయి క్రీడోత్సవాలను ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొని శారీరక, మానసిక వికాసం సాధించాల్సిందని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆకుల లక్ష్మీ నర్సయ్య, ప్రిన్సిపాల్ జి. లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# సీఎం కప్పు కబడ్డీ పోటీలు



**నేటి సాక్షి నారాయణపేట(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నాడు సీఎం కప్పు కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో మరికల్ మండల ఎంపీడీవో వృతివీరాజ్ మరికల్ గ్రామ సర్పంచ్ చెన్నయ్య, ఉపసర్పంచ్ కాజా, వార్డు సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాలకు విరాళం



**నేటి సాక్షి - మేడిపల్లి:** భీమారం మండలం మన్నెగూడెం గ్రామంలోని పల్లగుట్ట దేవాలయాల నిర్మాణానికి భూపెల్లి రాజారెడ్డి కుటుంబం రూ. 1,51,000/- విరాళం అందజేశారు. పల్లగుట్ట దేవాలయాల కమిటీకి విరాళం అందజేసే కార్యక్రమంలో సత్యారావు, కొండ కిషన్ గౌడ్, సూర్యా మెడికల్ రమేష్, కోమటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో బోల్తా 13 మంది గాయాలు



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మను దర్శించుకుని తిరుగు ప్రయాణంలో కొండ కింద కాంప్లెక్స్ వద్ద ఆటో బోల్తా పడి 13 మంది భక్తులు గాయాల పాలయ్యారు .బాపట్ల వద్ద గల రేపల్లెకు చెందిన కొందరు వలస కూలీలు సోమల మండలం కందూరు వద్ద కూలి పనులకు వచ్చారు .ఈ క్రమంలో శుక్రవారం అమ్మవారి రాహుకాల అభిషేకంలో పాల్గొనాలని భక్తులు ఆటో తీసుకొని వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో గంగాపురం వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 13 మంది భక్తులకు గాయాలయ్యాయి వెంటనే స్పందించిన ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు ,వారందరినీ 108 సేవల ద్వారా మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు,

# ఉచిత త్రాగునీటి పంపిణీ

**గోల్డెన్ బైట్ బ్రెడ్ కంపెనీ కరీంనగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో**




**నేటిసాక్షి గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో గత మూడు రోజుల నుండి శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరలో వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా గోల్డెన్ బైట్ బ్రెడ్ కంపెనీ కరీంనగర్ బ్రాంచ్ టీం ఉచిత త్రాగునీటిని ఏర్పాటు చేశారు. అనంతరం జాతరకు వచ్చిన భక్తులు గోల్డెన్ బైట్ బ్రెడ్ కంపెనీ టీంకు భక్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సీసీ కెమెరా బహుకరణ

### విద్యార్థుల భద్రతకు ఉప సర్పంచ్ చొరవ



**నేటి సాక్షి, ఎండపల్లి:** మండలంలోని కొత్తపేట జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని గ్రామ ఉప సర్పంచ్ సింహారాజు లక్ష్మీకాంతం సీసీ కెమెరాను పాఠశాలకు బహుకరించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ లక్ష్మీకాంతం మాట్లాడుతూ.. పాఠశాలల్లో భద్రత పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని, సీసీ కెమెరాల ద్వారా పాఠశాల పరిసరాల్లో క్రమశిక్షణ మరింత మెరుగుపడుతుందని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునేందుకు ఇది దోహదపడుతుందని అన్నారు. పాఠశాలకు సీసీ కెమెరా బహుకరణ పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ దాతకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధితో పాటు విద్యాభివృద్ధికి సహకరిస్తున్న ఉప సర్పంచ్‌ను ఉపాధ్యాయులు,విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎస్.సీ 2007-08 సం.పూర్వ విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాల్వ మల్లేశంకు గెలుపు కొరకే



**తిమ్మాపూర్, నేటి సాక్షి:** మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ 8వ డివిజన్ అభ్యర్థి కాల్వ మల్లేశంకు గ్రామ ప్రజల నుండి భారీ మెజార్టీతో గెలుపు సాధించాలని కోరారు. నామినేషన్ వేధింపులో ఆయన ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వినోద్ కుమార్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు, రాష్ట్ర నేతలు, మండల అధ్యక్షులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



**నేటి సాక్షి చిలుకూరు:** చిలుకూరు ఏఐ ఎస్ఎఫ్. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ నిర్వహిస్తున్నట్లుగా ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి కొండలు తమనబోయిన నరేష్‌లు తెలిపారు శుక్రవారం వారు విలేకరు సమావేశంలో మాట్లాడుతూ చిలుకూరు కవిత జూనియర్ కళాశాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు టాలెంట్ టెస్ట్ విద్యార్థులకు 60 మార్కులు ఉంటుందని. బహుమతులు ప్రభుత్వ. ప్రైవేటు విద్యార్థులకు వేరువేరుగా ఉన్నట్లుగా వారు తెలిపారు ఈ టాలెంట్ టెస్ట్‌లో పదవ తరగతి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు....

## మహాత్మా గాంధీ వర్ధంతి



**నేటి సాక్షి చిలుకూరు :** చిలుకూరు మండల కేంద్రంలో గ్రంథాలయ ఆవరణలో గాంధీ విగ్రహాన్ని పూల. మాలలు వేస్తున్న నాయకులు. చిలుకూరు బాపూజీ శాఖ గ్రంథాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జాతిపిత మహాత్మా గాంధీజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గరిన శేషగిరిరావు ఆర్యవైశ్య సంఘం నాయకులు గరినే వెంకటేశ్వర్లు అత్తులూరి శ్రీనివాసరావు ఓరుగంటి కిట్టు ఈగ శ్రీనివాసరావు స్వామి వెంకటేశ్వర్లు అత్తులూరి భుజంగరావు అత్తులూరి శీను కట్టమూరు అంజి గన్నార వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు...

## మహాత్మ గాంధీ వర్ధంతి



**నేటి సాక్షి తొగుట.. వడ్డే నర్సింలు:** తొగుట మండల కేంద్రంలోని మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి మాట్లాడుతూ స్వాతంత్రం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు.. కార్యక్రమంలో AMC మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్),గౌరవ సర్పంచ్లు పాగాల శోభా కొండల్ రెడ్డి,లాచోళ్ళ రవీందర్,గొడుగు జయమ్మ నర్సింలు,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొంగరి నర్సింలు,ఉపసర్పంచ్లు ఫోరం అధ్యక్షులు అమర్, స్వామి,ఆత్మ కమిటీ డైరెక్టర్లు భూపాల్ రెడ్డి,బాలుమల్లు,ప్రవీణ్,మాజీ వైస్ ఎంపీపీ మహిపాల్ రెడ్డి,మాజీ సర్పంచ్లు లీలాదేవి వెంకటేశం, సిలివేరి రాంరెడ్డి,కుంభం బాల్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు భారత్ తేజ,వార్డ్ సభ్యులు స్వామి,సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి,పంది రాజు,బండారు రమేష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్‌కు 100 నామినేషన్లు

**నేటి సాక్షి - శంకర్ పల్లి:** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని 15 కౌన్సిలర్ స్థానాలకు మొత్తం 100 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారని సహాయక జిల్లా ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ యోగేష్ శుక్రవారం వెల్లడించారు. సమయపాలనతో నామినేషన్ల ప్రక్రియ సజావుగా పూర్తయినట్లు కమిషనర్ తెలిపారు.

### వివరాల ప్రకారం:

**బిజెపి అభ్యర్థులు - 17 మంది**
**కాంగ్రెస్ అభ్యర్థులు - 42 మంది**
**టిఆర్ఎస్ అభ్యర్థులు - 21 మంది**
**ఇండిపెండెంట్ అభ్యర్థులు - 17 మంది**
**జనసేన అభ్యర్థులు - 2 మంది**
**బి.ఐ.పి అభ్యర్థి - 1 మంది**



# కాంగ్రెస్ పార్టీలో బహిరంగ వర్గపోరు

- **పెద్దనాగారం స్టేజీపై పేలిన అసంతృప్తి**
- **గ్రామ అధ్యక్షుడిని పక్కన పెట్టి అభివృద్ధి కార్యక్రమాలపై ఆగ్రహం**
- **జిల్లా ప్రధాన కార్యదర్శి-గ్రామ అధ్యక్షుడి విభేదాలు బహిరంగంగా వెలుగు**
- **మున్సిపల్ ఎన్నికల వేళ కాంగ్రెస్ ఐక్యతకు సవాల్**



**నేటి సాక్షి, మహబూబాబాద్:** నర్సింహులపేట మండలం పెద్దనాగారం స్టేజి గ్రామపంచాయతీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ లో అంతర్గత వర్గపోరు బహిరంగమైంది. గ్రామ పార్టీ అధ్యక్షుడు గుగులోత్ రమేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పత్రికా సమావేశం ఏర్పాటు చేసి, ఇటీవల పార్టీ లో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.

### గ్రామ పార్టీ అధ్యక్షుడు గుగులోత్ రమేష్ తెలిపారు:

"పార్టీ కోసం మొదటినుంచి కష్టపడి పనిచేసినవారు మన వర్గమే. అయినప్పటికీ, అభివృద్ధి కార్యక్రమాల్లో గ్రామ అధ్యక్షుడికి గానీ, స్థానిక నాయకులకు గానీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పక్కన పెట్టడం బాధాకరం. ఇది పార్టీ శ్రేణుల్లో అయోమయం, అసంతృప్తిని పెంచుతోంది."

### జిల్లా ప్రధాన కార్యదర్శి-గ్రామ అధ్యక్షుడు విభేదాలు

వీరిద్దరి మధ్య విభేదాలు తీవ్ర స్థాయికి చేరాయని, ఈ సమస్య ఇప్పుడు బహిరంగ చర్చకు వస్తోందని రమేష్ స్పష్టం చేశారు. గెలిచినప్పటి నుంచి తమ వర్గాన్ని లెక్కచేయకుండా వ్యవహరించడం వల్ల పార్టీ బలోపేతానికి నష్టం జరుగుతోందని, ఇలాంటి పరిస్థితులు కొనసాగితే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

### ఐక్యత పిలుపు

డోర్నకల్ ఎమ్మెల్యే & ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ నేతృత్వంలో డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని రమేష్ పేర్కొన్నారు. డోర్నకల్ మరియు మరిపెడ మున్సిపాలిటీలలో జరుగనున్న ఎన్నికల్లో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి, పార్టీ గెలుపుకోసం ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

### పార్టీ బలోపేతం కోసం కీలక సూచనలు

కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, నియోజకవర్గ అభివృద్ధికి దారితీయాలంటే: **పార్టీ లో సమన్వయం, పారదర్శకత నాయకుల మధ్య పరస్పర గౌరవం.** అవసరమని నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం చోటుచేసుకున్న వర్గ విభేదాలు మున్సిపల్ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి పెద్ద సవాలుగా మారుతున్నాయి.

### పత్రికా సమావేశంలో పాల్గొన్నారు

పెద్దనాగారం స్టేజి మాజీ ఉపసర్పంచ్ కొమ్ము అనిల్ కిసాన్. సెల్ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బ అశోక్ రెడ్డి. యువ నాయకులు కొమ్ము మధుబాబు. మాజీ వార్డ్ మెంబర్ చలమల్ల నవ్య ప్రసాద్. నాయకులు పులిచింతల కృష్ణారెడ్డి.ఎస్టీ సెల్ నాయకుడు భానోత్ వెంకన్న. యూత్ కాంగ్రెస్ నాయకులు గోసుల ప్రమోద్.

# రోడ్ సేఫ్టీపై శ్రీ చైతన్య స్కూల్‌లో అవగాహన కార్యక్రమం

- **వ్యాసరచన-చిత్రలేఖన పోటీల్లో విద్యార్థుల ఉత్సాహభరిత పాల్గొనడం**
- **రహదారి భద్రతపై చిన్న వయసులోనే బాధ్యతాభావం**

**నేటి సాక్షి సుధాకర్ గౌడ్ శంకర్‌పల్లి:** రహదారి ప్రమాదాలను నివారించేందుకు విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో శంకర్‌పల్లి పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో రోడ్ సేఫ్టీ అంశంపై వ్యాసరచన మరియు చిత్రలేఖన పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీల ద్వారా చిన్న వయసు నుంచే రహదారి భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను తెలియజేయడమే ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ ధరించడం, జీబ్రా క్రాసింగ్ పాటించడం వంటి అంశాలను విద్యార్థులు తమ రచనలు, చిత్రాల ద్వారా స్పష్టంగా ప్రతిబింబించారు. వ్యాసరచన పోటీలో విద్యార్థులు రోడ్ సేఫ్టీ వల్ల కలిగే ప్రయోజనాలు, నిర్లక్ష్యం కారణంగా జరుగుతున్న ప్రమాదాలు, బాధ్యతాయుతమైన పౌరుల పాత్ర వంటి అంశాలపై భావగర్భితంగా రచనలు చేయగా, చిత్రలేఖన పోటీలో రంగురంగుల బొమ్మలతో "సేఫ్ డ్రైవింగ్ – సేవ్ లైవ్స్" అనే సందేశాన్ని హృదయాన్ని తాకేలా చిత్రీకరించారు. కార్యక్రమం ముగింపులో విజేతలుగా ఎంపికైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, రహదారి భద్రత అనేది ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా నిత్యజీవితంలో పాటించాల్సిన ముఖ్యమైన అంశమని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం వెల్లడించింది.




# వనదేవతలను దర్శించుకున్న మంత్రి అడ్లూరి

- **సమ్మక-సారలమ్మకు నిలువెత్తు బంగారం సమర్పణ**
- **అమ్మవార్ల ఆశీస్సులు అందరిపై ఉండాలి**





**నేటి సాక్షి, ఎండపల్లి:** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో ప్రకృతి ఒడిలో కొలువైన వన దేవతలు సమ్మక్క-సారలమ్మలను రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కుగా నిలువెత్తు బంగారం సమర్పించారు. వనదేవతల సన్నిధిలో సంప్రదాయ పూజా విధానాల మధ్య మంత్రి అమ్మవారి ఆశీస్సులు పొందారు. దీనికి ముందుగా అనుచరులతో కలిసి వచ్చిన మంత్రికి జాతర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో డప్పు చప్పులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పూజారుల ఆశీర్వచనాలు తీసుకుని, అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, ప్రాంతంలో శాంతి, సమృద్ధి నెలకొనాలని అమ్మవార్ల ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. జాతర ఉత్సవాల ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాల కల్పనపై స్థానిక నాయకులతో మాట్లాడి సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధి, ఉత్సవాలకు ప్రభుత్వం నుండి రూ.10 లక్షలు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సంగ రమేష్, ఏఎంసీ చైర్మన్ గుండాటి గోపిక, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి, జాతర ఉత్సవాల నిర్వహణ కమిటీ అధ్యక్షులు ఏలేటి శైలేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు గాజుల మల్లేశం, ఉప సర్పంచ్ మెరుగు జానీ, కొత్తపేట సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, మెరుగు మురళి, కందికట్ల రాజేశం, పోలోజు శ్రీనివాస్, వెంకటస్వామి, యువజన కాంగ్రెస్ నాయకులు గాజుల విజయ్, గెల్లు శ్రీనివాస్, మ్యాకల సంతోష్, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కెఎన్ఎంలో చేరండి...మీ బంగారు భవిష్యత్తు కు బాటలు వేసుకోండి






- **కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల...**
- **వెంతో మంది విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలిపింది**

**నేటిసాక్షి, మిర్యాలగూడ:** కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంతో మంది విద్యార్థులను గొప్ప స్థాయిలో నిలిపిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ మల్గిరెడ్డి భీమార్జున రెడ్డి అన్నారు. 2026-2027 విద్యా సంవత్సరంలో తమ డిగ్రీ కళాశాలో విద్యార్థులు చేరాలని చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నేరెడుచర్ల, మిర్యాలగూడలలోని ఇంటర్మీడియేట్ కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యే భవిష్యత్తుకు పునాది అని, ఆ పునాదిని బలంగా నిర్మించేది ప్రభుత్వ డిగ్రీ కళాశాలలేనని అన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, సమగ్ర పాఠ్యప్రణాళిక, ఆధునిక ప్రయోగశాలలు, గ్రంథాలయ సౌకర్యాలు, ఆవిశాలమైన తరగతి గదులు, ఆటస్థలం, ఎన్ఎస్ఎస్. మొదలైనవన్నీ తమ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్.సి.సి. సౌకర్యం తమ కెఎన్ఎం. కళాశాల ప్రత్యకత అని, దీనిద్వారా ఉన్నతవిద్యలో, ఉద్యోగ సాధనలో రిజర్వేషన్ లబిస్తుందని విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఇటీవల పిఎం ఉషా (రుసా) వారి రూ.5 కోట్ల నిధులతో కళాశాలకు నూతన భవనం, కంప్యూటర్లు, అన్ని రకాల ల్యాబ్ సౌకర్యాలు సమకూరాయని, నాణ్యమైన విద్య, ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు, ఉన్నత విద్య కొరకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, పోటీ పరీక్షలకు శిక్షణ, వ్యక్తిత్వ వికాస తరగతులు మొదలైనవన్నీ తమ డిగ్రీ కళాశాల ప్రత్యేకతలని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కళాశాలలో నిర్వహించబడుతాయని తెలియజేసారు. విద్యను వ్యాపారంగా కాకుండా సేవగా భావించి పనిచేసేవి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలే కనుక, విద్యార్థులు తమ ఉజ్జ్వల భవిష్యత్తు కొరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే చేరాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రవీందర్, నాగరాజు, నరేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఆఫీసర్లు సమన్వయంతో పనిచేయాలి

- మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించా
- జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు ఆదేశాలు



**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో( రాధారపు నర్సయ్య ):** రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు ఐఏఎస్ అధికారులకు స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తూ, నోడల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో జనరల్ అబ్జర్వర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎక్స్పెండీచర్ అబ్జర్వర్ డి. శ్రీనివాస్‌లతో కలిసి రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై జిల్లా నోడల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లతో సమగ్రంగా చర్చించారు.

**కలిసికట్టుగా పనిచేయాలి**

ఈ సందర్భంగా జనరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ..ఎన్నికల నిర్వహణలో క్షేత్రస్థాయిలో అన్ని విభాగాలు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. నామినేషన్ల నుంచి పోలింగ్ వరకు ప్రతి దశను నిబంధనల ప్రకారం పర్యవేక్షిస్తూ, ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

**నిబంధనలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలి**

జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికలు సజావుగా జరగాలంటే సంబంధిత అధికారులు నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం, గుర్తుల కేటాయింపు వంటి ప్రక్రియల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు అవసరమైన అనుమతుల కోసం సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన, అక్కడ కల్పించాల్సిన సౌకర్యాలపై క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి, అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి ఐపిఎస్, జిల్లా నోడల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కులు చెల్లించుకున్న మాజీ మంత్రి మల్లారెడ్డి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్





**కీసర నేటి సాక్షి:** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళా, మన వనదేవతలు శ్రీ మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతర సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మాజీ మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి మేడారంలోని చిలుకలగుట్ట నుంచి మేడారం గద్దెలపైకి చేరిన సమ్మక్క తల్లీబిడ్డలను దర్శించుకుని పలకరించారు. అలాగే కుటుంబ సమేతంగా వెళ్లి సమ్మక్క సారలమ్మ అమ్మ వార్లను దర్శనం చేసుకొవడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే మల్లారెడ్డి నిలువెత్తు బంగారంతో అమ్మవార్లకు మొక్కులు చెల్లించేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేడారం సమ్మక్క సారలమ్మ తల్లుల చల్లని దీవెనలు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటూ

తెలంగాణ ప్రజలందరికీ మేడారం మహా జాతర శుభాకాంక్షలు తెలియజేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో 507 మంది నామినేషన్లు







**నేటిసాక్షి, మిర్యాలగూడ:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని మొత్తం 48వార్డులకు గాను శుక్రవారం నాటికి 507 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ నుండి 213 మంది నామినేషన్లు దాఖలు చేయగా, బీఆర్ఎస్ నుండి 139, ఆప్ నుండి 07, బిజెపి నుండి 56, బీఎస్పీ 05, సిపిఎం 11, ఏఐఎంఎం 01, టిడిపి 02, గుర్తింపు లేని పార్టీ ల నుండి 19 మంది, స్వతంత్ర అభ్యర్థులు 56 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అనంతరం నామినేషన్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు రమేష్ పరిశీలించి, వివరాలను తెలుసుకున్నారు.

# నామినేషన్ కేంద్రాల పరిశీలన చేసిన ఎన్నికల వ్యయ పరిశీలకులు

**నేటి సాక్షి - మెట్‌పల్లి:** జగిత్యాల జిల్లాలో జరుగుతున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నియమితులైన ఎన్నికల వ్యయ పరిశీలకులు డి. శ్రీనివాస్ శుక్రవారం మెట్‌పల్లి మున్సిపాలిటీలో నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు ఎన్నికల నియమావళి ప్రకారం విధులు నిర్వహించాలని, నామినేషన్ పత్రాలు మరియు ధ్రువీకరణ పత్రాలను రిటర్నింగ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అభ్యర్థులు నిర్దేశిత వ్యయ పరిమితిలోనే ఖర్చులు చేయాలని, ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరవాలని, ఖర్చుల బిల్లులు సమర్పించాలని తెలిపారు. పార్టీ వ్యయం, అభ్యర్థి వ్యయం అన్నింటిని నమోదు చేయాలని సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రిటైర్మెంట్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

- డీఏ, పీఆర్‌సీ, బకాయిలు వెంటనే చెల్లించాలి
- టిజియుఎస్ జిల్లా అధ్యక్షులు నునావత్ రాజు డిమాండ్



**నేటి సాక్షి - కోరుట్ల(రాధారపు నర్సయ్య )** రిటైర్మెంట్ పొందుతున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీతో పాటు అన్ని రిటైర్మెంట్ బకాయిలను ఆలస్యం లేకుండా చెల్లించాలని టీ జీ యు ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు నునావత్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**పదవీవిరమణ సమయంలో ఆర్థిక ఇబ్బందులు**

కోరుట్ల మండలం ఏకిన్‌పూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడు జుంబర్తి శంకర్ పదవీవిరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏళ్ల తరబడి విద్యారంగానికి సేవలందించిన ఉపాధ్యాయులు పదవీవిరమణ సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీ అమలు, ఇతర రిటైర్మెంట్ బకాయిలను ప్రభుత్వం బాధ్యతగా వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు.

**ఉపాధ్యాయుల సేవలు సమాజానికి అమూల్యం**

అనంతరం సభాధ్యక్షులు మార్గం రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సేవలు సమాజానికి అమూల్యమైనవని పేర్కొన్నారు. రిటైర్మెంట్ అనంతరం కూడా ఉపాధ్యాయులు గౌరవప్రదమైన జీవనం సాగించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పదవీవిరమణ పొందిన జుంబర్తి శంకర్ తన సేవా ప్రయాణాన్ని స్మరించుకుంటూ, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి మండలాల విద్యాధికారులు నరేశం, శ్రీనివాస్, లక్ష్మీనారాయణలు, సోదర ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి రాజేష్, రాష్ట్ర నాయకులు బోనగిరి దేవయ్య, సిరిపురం రాజేష్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## 'వార్త' క్యాలెండర్ ఆవిష్కరణ



**నేటి సాక్షి - మేడిపల్లి:** భీమారం/మేడిపల్లి ప్రాంతంలో 'వార్త' దినపత్రిక క్యాలెండర్‌ను మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో సభ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా, పత్రికలు ప్రజలకు సరైన సమాచారం అందించడంలో, ప్రజలు–పోలీసుల మధ్య సమన్వయం పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీపతి, దయాకర్, ఆంజనేయులు, ప్రేమ్, వజ్ర లింగం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ 78వ వర్ధంతి

**ఘనంగా జరిపి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నివాళులు**



**నేటి సాక్షి - కాప్రా:** మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా, మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో గల గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గాంధీని దేశ సమగ్రత, ఐక్యత కోసం తన జీవితం అర్పించిన మహోన్నత వ్యక్తిగా పేర్కొన్నారు. ఆయన ఆశయాల ప్రకారం యువత అహింసా మార్గంలో నడవాలని, గాంధీ జీవితం నుండి దిక్సూచనలను నేర్చుకోవాలని సూచించారు.

## మెట్‌పల్లిలో భారీగా నామినేషన్లు

**నేటి సాక్షి - మెట్ పల్లి:** ఈరోజు చివరి రోజు కావడంతో కాంగ్రెస్. టిఆర్ఎస్. బిజెపి పార్టీల అభ్యర్థులు మరియు స్వతంత్రులు కార్యకర్తలతో నామినేషన్ కేంద్రల దగ్గరికి ర్యాలీగా వచ్చి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు కౌన్సిలర్ అభ్యర్థుల నడుమ తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో కార్యకర్తలను బుజ్జగిస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు ఇది ఇలా ఉంటే ఒక్కో వార్డులో ఒకే పార్టీ నుండి ఒక్కరి కన్న ఎక్కువ నామినేషన్లు దాఖలు చేశారు ఎవరికి బీఫారాలు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థిగా శ్వేతా



**రంగారెడ్డి జిల్లా, శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మున్సిపల్ 14వ వార్డు అభ్యర్థిగా శ్వేతా పాండురంగారెడ్డి నామినేషన్ వేయడం శుక్రవారం జరిగింది. 14వ వార్డు ప్రజలతో కలిసి మున్సిపల్ ఆఫీసు వరకు హీరోయిన్ ర్యాలీలో చేరిన శ్వేతా, కార్యకర్తలు, యువకులు, మహిళల ప్రోత్సాహంతో నామినేషన్ సమర్పించారు. ప్రజలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని, శ్వేతా పాండురంగారెడ్డి విజయం ఖాయం అని ఆశాభావం వ్యక్తం చేశారు. నామినేషన్ సందర్భంగా, శ్వేతా పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## రూ.10 వేలు విరాళం

**అందించిన ముప్పా రామారావు**



**నేటి సాక్షి కీసర:** కీసర సర్కిల్ పరిధి బండ్లగూడలోనీ 4వ డివిషన్ లో 27వ ఉరుసు ఉత్సవాలను ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ ఉరుసు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా 4వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పా రామారావు, సీనియర్ నాయకులు సంతోష్ గౌడ్, దిలీప్, మహేష్‌లతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ముప్పా రామారావు ఈ శుభ సందర్భంగా ఉత్సవానికి రూ.10 వేలు రూపాయలను ఉదారంగా విరాళంగా అందజేశారు. ఉరుసు నిర్వాహకులకు, భక్తులకు తన హృదయపూర్వక మద్దతును తెలియజేశారు.

## సుప్రజ రాజీవ్ రెడ్డి నామినేషన్



**నేటి సాక్షి,చేర్యాల:** పట్టణ కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ నాలుగో వార్డ్ అభ్యర్థిగా నిమ్మ సుప్రజా రాజీవ్ రెడ్డి భారీ ర్యాలీతో తరలి వెళ్లి నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. అంతకుముందు నాలుగో వార్డ్ లో ప్రతి ఇంటి ఇంటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని సుప్రజ కోరారు. వార్డులో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తానని. ప్రతి ఒక్కరూ నన్ను ఆశీర్వదించాలని కోరారు.చత్రపతి చౌరస్తాలో ఉన్న చత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేశారు.అనంతరం హనుమాన్ టెంపుల్ పూజలు చేసి నామినేషన్ సెంటర్ దగ్గరకు వచ్చి నామినేషన్ దాకలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మహిళలు పెద్ద ఎత్తున యువకులు పాల్గొన్నారు

TGTEL/25/A1737 | NETI SAKSHI

## ప్రచారంలో డాక్టర్ సంజయ్



**నేటి సాక్షి- మెట్ పల్లి(దామ రాజేష్):** మెట్‌పల్లి పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ తరుపున ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ప్రచారం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజలకు అందజేస్తూ, కాంగ్రెస్ హామీల వైఫల్యాలను ప్రజలకు వివరించి అలాగే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీమెజారిటీతో గెలిపించాలని పట్టణ ప్రజలను కోరారు.. ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, మెట్‌పల్లి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే dr. కల్వకుంట్ల సంజయ్ స్పష్టం చేయడం జరిగింది

## ప్రాణం కాపాడిన ఉద్యోగి



**నేటి సాక్షి - జగిత్యాల:** జగిత్యాల శ్రీరామ చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పసివాడిని మున్సిపల్ ఉద్యోగి రాజేష్ వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. వైద్యులు సీపీఆర్ చేయడంతో చిన్నారి కోలుకున్నాడు. రాజేష్ మానవీయ స్పందనకు ప్రజలు ప్రశంసలు తెలిపారు.

## నాయకుడి కుమారుడు మృతి



**నేటి సాక్షి - కోరుట్ల:** మెట్‌పల్లి తొలి మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రోళ్ల హన్మండ్లు యాదవ్ కుమారుడు ఎర్రోళ్ల వంశీ యాదవ్ (హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి) శుక్రవారం అకస్మాత్తుగా మృతి చెందారు. ఈ ఘటనతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. వంశీ యాదవ్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ వార్తతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

## కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



**నేటి సాక్షి - కొమరం భీమ్ ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ పట్టణంలో బజార్‌వాడీ కాలనీలో బి.ఆర్.ఎస్ పార్టీ నుంచి తెలంగాణ ఉద్యమకారుడు సాజిద్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళలు, యువత, కాలనీ వాసులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలోకి వచ్చిన వారికి కాంగ్రెస్ అసెంబ్లీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సక్కు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని శ్యామ్ నాయక్ కార్యకర్తలను కోరారు.

## విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్



**నేటి సాక్షి - కొమరం భీమ్ ఆసిఫాబాద్**బీ రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామంలో నిర్వహించనున్న గంగాపూర్ జాతర సందర్భంగా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అత్యంత అప్రమత్తతతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ ఆదేశించారు. జాతర నిర్వహణకు సంబంధించి గంగాపూర్‌లో పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక డ్యూటీ సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. జాతరకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణను సమర్థవంతంగా నిర్వహించాలని, ఆలయ ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాల్లో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళలు, పిల్లల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై నిఘా పెంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సిద్ధంగా ఉండాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్నేహపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. గంగాపూర్ జాతరను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గంగాపూర్ జాతర విధుల నిర్వహణకు మొత్తం 282 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ వాహీదుద్దీన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, రెబ్బెన సీఐ సంజయ్, ఎస్సై వెంకటకృష్ణ, వాంకిడి సీఐ సత్యనారాయణ, ఆర్.ఐ. అంజన్న, తీర్యాని ఎస్ఐ వెంకటేష్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రాలపై పటిష్ట నిఘా

- చివరి రోజు నామినేషన్ కేంద్రాలను పర్యవేక్షించిన అదనపు ఎస్పీ
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు: శేషాద్రిని రెడ్డి



**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో జగిత్యాల జిల్లా పరిధిలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి క్షేత్రస్థాయిలో సందర్శించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా సజావుగా సాగేలా తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. నామినేషన్ కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి అవసరమైన భద్రతాపరమైన సూచనలు చేశారు. అభ్యర్థులు, వారి అనుచరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశమున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ)ని అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కచ్చితంగా పాటించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో అదనపు ఎస్పీ వెంట డీఎస్పీ రాములు, ఇన్స్పెక్టర్లు చిరంజీవి,కరుణాకర్, అనిల్ కుమార్‌తో పాటు సంబంధిత ఎస్ఐలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తీరుపై అసంతృప్తితోనే కాషాయ కండువా

- కోరుట్ల మాజీ కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం బిజెపిలో చేరిక
- పట్టణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన పరిణామం



**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య )** కోరుట్ల పురపాలక సంఘ మాజీ కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం భారతీయ జనతా పార్టీలో చేరడం పట్టణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

### కోరుట్లలో రెండో హాట్ టాపిక్

గురువారం సాయంత్రం నుంచే ఈ అంశంపై రాజకీయ వర్గాల్లో లోలోపల తీవ్ర స్థాయిలో చర్చలు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనకు వార్డు కేటాయింపులో విపరీత ధోరణి ప్రదర్శించిందనే మనస్తాపంతో ఆయన కాంగ్రెస్ పార్టీని వీడి బిజెపిలో చేరినట్లు ఎంబేరి పేర్కొన్నారు. తోట గంగాధర్ ఒకే రోజు రెండు పార్టీలు మారిన ఉదంతం చర్చించుకుంటున్న సమయంలోనే..ఎంబేరి నాగభూషణం కరుడుగట్టిన కాంగ్రెస్ పార్టీ నాయకుడుగా ముద్ర ఉన్న ఆయన అనూహ్యంగా బిజెపి లోకి మారడం హాట్ టాపిక్ గా ముచ్చటించుకుంటున్నారు.

### తగిన గౌరవం లభించలేదు

కాంగ్రెస్ పార్టీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన నాగభూషణం, తన భావాలకు, ఆదర్శాలకు దగ్గరగా ఉన్న బిజెపిని ఎంచుకున్నట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. వార్డులో తన సేవలను పార్టీ గుర్తించకపోవడం, వ్యక్తిగతంగా చేసిన కృషికి తగిన గౌరవం లభించకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు.

### సేవా కార్యక్రమాలు గుర్తుండిపోతాయి

స్వతహాగా దైవభక్తి కలిగిన నాగభూషణం, వేములవాడ దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యునిగా ఉన్న సమయంలో కోరుట్ల పట్టణానికి చేసిన సేవలు మరువలేనివని ఆయన అభిమానులు తెలిపారు. కోరుట్ల–మెట్‌పల్లి జాతీయ రహదారి గోదాం వద్ద వేములవాడ రూట్లో ఆర్చ్ నిర్మాణం, నంది విగ్రహం ప్రతిష్ఠతో పాటు అక్కడ దేవాలయ నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.

### ఎన్నికల వేళ రాజకీయ నిర్ణయం

ప్రస్తుత ఎన్నికల వేడి నేపథ్యంలో తన రాజకీయ భవిష్యత్తును మరింత బలంగా మలచుకోవాలన్న ఉద్దేశంతో నాగభూషణం బిజెపిలో చేరినట్టు సమాచారం. ధర్మపురి ఎంపీ అరవింద్ సమక్షంలో ఆయన కాషాయ కండువా కప్పుకున్నారు. నాగభూషణం బిజెపిలో చేరడం ద్వారా కోరుట్ల పట్టణంలో పార్టీకి కొత్త జోష్ వచ్చిందని బిజెపి శ్రేణులు వ్యాఖ్యానించాయి.

# చివరి రోజు ప్రశాంతంగా నామినేషన్ ప్రక్రియ



- 5 మున్సిపాలిటీలకు మొత్తం 530 నామినేషన్లు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. సత్యప్రసాద్ వెల్లడి

**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో( రాధారపు నర్సయ్య )** జగిత్యాల జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు జరుగనున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ చివరి రోజు ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కలిపి మొత్తం 530 నామినేషన్ పత్రాలు దాఖలైనట్లు వెల్లడించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తరపున అత్యధికంగా 239 నామినేషన్లు దాఖలయ్యాయని కలెక్టర్ తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ నుంచి 102, భారతీయ జనతా పార్టీ నుంచి 120 నామినేషన్లు వచ్చాయని చెప్పారు. అలాగే సిపిఐ నుంచి ఒకటి, ఏఐఎంఐఎం నుంచి 16, జనసేన పార్టీ నుంచి నాలుగు, ఏఐఎఫ్ బి నుంచి ఎనిమిది నామినేషన్లు దాఖలైనట్లు వివరించారు. స్వతంత్ర అభ్యర్థులు 40 మంది నామినేషన్ పత్రాలు సమర్పించినట్లు పేర్కొన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి కట్టుదిట్టంగా అమలయ్యేలా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల పరిశీలన, తదుపరి ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

- కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ సమక్షంలో పార్టీలో చేరిక
- 8వ వార్డులో బీఆర్ఎస్ బలోపేతం



**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య )** కోరుట్ల పట్టణం 8వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అయిండ్ల గణేష్‌తో పాటు పలువురు నాయకులు కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కోరుట్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ చేరిక కార్యక్రమం నిర్వహించారు.

### 15 ఏళ్ల సేవలకు గుర్తింపు లేకుండా పోయింది

ఈ సందర్భంగా అయిండ్ల గణేష్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేసినప్పటికీ తనకు తగిన గుర్తింపు, న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీ విధానాలు, ముఖ్యంగా కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ నాయకత్వం తనను ఆకర్షించిందని తెలిపారు. అందుకే బీఆర్ఎస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

### నేనొక డాక్టర్ ని..కాపాడుకోవడమెలాగో తెలుసు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ

పార్టీలో నూతనంగా చేరిన నాయకులు, యువకులకు బీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీలో ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. నేనొక డాక్టర్ ని.. ఎవరిని ఎలా కాపాడుకోవాలో తెలిసిన వాడిని..నావాల్లందరినీ కాపాడుకుంటానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# కనిపించని ఆ 'నాలుగో సింహమే' కమిషనర్!

- కోరుట్ల మున్సిపల్ కార్యాలయంలో 'జాతీయ చిహ్నానికి అవమానం'
- 'మూడు సింహాల చిహ్నం'.. కూల్చేసి 'చెత్తకుప్ప'లో పారేసిన వైనం
- ఇంటిలిజెన్స్ సాక్షిగా.. మీడియా కవరేజ్ చేసినా.. సిఐ మందలించినా 'లైట్ తీసుకున్న-మున్సిపల్ అధికారులు'.!
- సదరు 'గ్రూప్-1' సార్ నిర్లక్ష్యం వివాదాస్పదం

## ఇంతకీ..ఏంటో ఆ 'వివాదం'?

జగిత్యాల జిల్లా కోరుట్ల పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో.. అభివృద్ధి పనుల మధ్య భారత జాతీయ చిహ్నం (మూడు సింహాల గద్దెతో కూడిన అశోక చక్రం)ను కూల్చి, మూలకు పడేసిన తీరు సామాజిక వర్గాల్లో తీవ్ర విమర్శలకు దారితీసింది. ఇది 'జాతీయ చిహ్నానికి స్పష్టమైన అవమానం'గా పరిగణించబడుతోంది. మున్సిపల్ కమిషనర్ రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకోక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి.



**అధికార యంత్రాంగంలో కొందరు అధికారులు 'ఆకాశం నుంచి ఊడిపడుతుంటారు' అప్పుడప్పుడు.! వీళ్ల వైఖరి ఎలా ఉంటుందంటే.? రాజ్యాంగాన్ని అవపోసన పట్టిన అపర విద్యావంతులుగా భ్రమిస్తుంటారు.! సరిగ్గా ఇలాంటి ఓ అధికారే 'కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రూపంలో సాక్షాత్కరించారు.! ఇంత ఉపోద్ఘాతం ఎందుకంటే.. ఆయన మోనార్క్ కదా.? 'జాతీయ చిహ్నాలను' అవమానించడం చట్టరీత్యా నేరమని తెలిసుండీ లైట్ తీసుకున్న వైనం వివాదాస్పదమైంది.!**

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)

## 25 లక్షల రోడ్డేస్తే 'జాతీయ చిహ్నాన్ని అవమానించాలా'?

కోరుట్ల మున్సిపల్ కార్యాలయం ఆవరణలో రూ.25 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు వేయించిన సందర్భంలో, జాతీయ చిహ్నం (అశోక స్తంభంపై మూడు సింహాల గద్దె, అశోక చక్రం) అడ్డంగా ఉందని, దానిని తొలగించి పక్కన మూలకు పడేశారు. ఈ కార్యాలయం రోజువారీగా వందలాది మంది ప్రజలు సందర్శించే ప్రదేశం. ఎన్నికల సమయంలో కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్డీఓ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు తరచూ పర్యవేక్షణకు వచ్చే చోటు. అయినప్పటికీ, ఈ ఘటన జరిగినా ఎలాంటి తక్షణ చర్యలు తీసుకోలేదు.





## అధికారుల నిర్లక్ష్యం - ప్రజా విమర్శలు

మున్సిపల్ కమిషనర్ రవీందర్ (తాను గ్రూప్-1 అధికారి, మాజీ సచివాలయ క్లాస్-1 అధికారి అంట ఆయన మాటల్లో.. అప్పుడప్పుడు) ఈ పనులకు బాధ్యత వహించారు. మున్సి'పాలక వర్గం' లేకపోవడంతో కమిషనరే పూర్తి అధికారంతో నిర్ణయాలు తీసుకున్నారు. ఈ ఘటనపై మేధావులు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తల నుంచి బలమైన ఆందోళన వ్యక్తమవుతోంది. జాతీయ చిహ్నం భారత స్వాతంత్ర్యం, ఐక్యత, రాజ్యాంగ విలువలకు ప్రతీక అని, దీనికి అవమానం జరగడం సహించరానిదని వారు వాదిస్తున్నారు.

## రాజకీయ సందర్భం - వివాదం

ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉండి, బిఆర్ఎస్ గద్దెలను కూల్చాలని టిడిపి అధినేతలాగా పిలుపు నిచ్చిన వ్యాఖ్యలను.. బహుశా ఇతను తనకు అన్వయించుకు న్నట్టున్నడు. ఈ నేపథ్యంలో, కోరుట్ల కమిషనర్ రవీందర్ తన అధికార హోదాలో జాతీయ చిహ్నాలను తొలగించడం మరింత వివాదాన్ని రేకెత్తించింది. ఇది ముఖ్యమంత్రి వ్యాఖ్యలను తప్పు గా అర్థం చేసుకుని చేసిన చర్యా? లేదా అభివృద్ధి పనులకు అడ్డంకిగా భావించారా? అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

## మందలించినా? పట్టించుకోని సార్!

మున్సిపల్ కార్యాలయం పక్కనే తొలగించబడ్డ 'జాతీయ చిహ్నాలను' చెత్తకుప్పలో పారేసిన వైనాన్ని 'మీడియా' కవరేజ్ చేసింది. ఈ విషయం అక్కడే ఉన్న 'ఇంటిలిజెన్స్-స్పెషల్ పార్టీ' పోలీసు దృష్టికి వచ్చింది.వారు వెంటనే ఈ ఘటన తాలూకు సమాచారం అంతా తమ 'పై అధికారులకు' చేరవేశారు.దీంతో వెంటనే కోరుట్ల సిఐ సురేష్ బాబు సీరియస్‌గా తీసుకుని కమీషనర్ రవిందర్‌ను విషయం అడిగి తెలుసుకున్నారు. ఇది చట్టరీత్యా నేరమవుతుందని మందలించారు. అయినా.. సార్ వారు.. మరింత లైట్ తీసుకుని.. ఎస్! ఆ విషయం మాకంతా తెలుసు మేం చూసుకుంటామని నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించి.. తన సిబ్బందిని ఆదేశించారు. దాని సంగతేదో చూడుమని.! 'యధా రాజా-తథా ప్రజా' అన్నట్టు కమీషనర్ సారే గట్లుంటే.. ఇగ సిబ్బంది కూడా గట్లనే ఉ ంటరు..కదా.? వెంటనే అయ్యవారి ఆదేశాల మేరకు తొలగించి చెత్తకుప్పలో పారేసిన 'ఆ-జాతీయ చిహ్నాల'ను ఒక నల్ల కవర్ చుట్టి అదే చెత్తకుప్పలో వదిలేసి చేతులు దులిపేసుకున్నారు.

## అవమానించిన వారిపై చట్టపరమైన చర్యలు అవసరం

ఈ ఘటన పునరావృతం కాకుండా చూడటానికి, బాధ్యులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మేధావులు, స్వచ్ఛంద సంస్థలు డిమాండ్ చేస్తున్నారు. జాతీయ చిహ్నానికి అవమానం శిక్షార్హ నేరమని చట్టం స్పష్టం చేస్తుంది. పోలీసులు కేసు నమోదు చేసి, బాధ్యులపై చర్యలు చేపట్టాలి. లేకపోతే, ఇలాంటి నిర్లక్ష్యాలు దేశ గౌరవానికి మరింత భంగం కలిగిస్తాయని చెప్పక తప్పదు.మరి.! ఈ విషయంలో 'చట్టం తన పని తాను చేసుకుపోతుందా..'? లేక చట్టం కూడా ఏవైనా 'లొసుగులు' చూపి వీళ్లా 'లైట్ తీసుకుంటారా'న్నది వేచి చూడాల్సిందే.!!

## వాళ్లు అలా! వీళ్లు ఇలా!! ఖర్మ?

బాధ్యతగా ఉండాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంటే.? వారిని నిలదీయాల్సిన 'రాజకీయ నాయకులు - ప్రజా ప్రతినిధులు' మాకేంపట్టి అన్నరీతిన ప్రవర్తించిన వైనం చర్చానీయాంశమైంది. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 'నామినేషన్' పత్రాలతో 'క్యూ' కట్టిన వారు ..'ప్రజాప్రతినిధులు'గా ఎన్నిక అయ్యేందుకున్న శ్రద్ధ ..మన 'జాతీయ చిహ్నాల'ను తొలగించి చెత్తకుప్పలో పారేసినా విషయం పట్టించుకోకపోవడం విచారకరం. వీరు దేశభక్తులా.? వీళ్లా..? రాజ్యాంగాన్ని పరిరక్షించేది.? వీళ్లా.? సమాజ రక్షకులు.? ప్రభుత్వ పక్షం.. ప్రతిపక్షం..అంటూ ఇప్పుడు ఏదీ లేదు..అంతా స్వార్థపక్షమే.!

## ఇదేమైనా..! చట్టరీత్యా నేరమా?

ఎస్.! ఔను ఇది ముమ్మాటికీ 'చట్టరీత్యా నేరమే' అంటోంది రాజ్యాంగం.భారత జాతీయ చిహ్నం (State Emblem of India)కు సంబంధించిన అనుచిత ఉపయోగాన్ని నియంత్రించే ప్రధాన చట్టం The State Emblem of India (Prohibition of Improper Use) Act, 2005 (సెక్షన్ 3, 7). ఈ చట్టం ప్రకారం, జాతీయ చిహ్నాన్ని అనుమతి లేకుండా వాణిజ్య, వృత్తిపరమైన లేదా అనుచిత రీతిలో ఉపయోగించడం నిషేధం. అలాగే, దానిని అవమానపరిచినా లేదా తప్పుగా తొలగించినా శిక్షార్హం కిందికే వస్తుందంటున్నారు న్యాయనిపుణులు.ఇది జాతీయ జెండా, రాజ్యాంగానికి సంబంధించిన అవమానాలను కూడా కవర్ చేసే Prevention of Insults to National Honour Act, 1971 (సెక్షన్ 2) కిందకు వస్తుంది. ఈ చట్టం ప్రకారం, జాతీయ జెండా లేదా దాని భాగాలను (అశోక చక్రం వంటివి) అవమానపరిచినా, నాశనం చేసినా లేదా అవమానకరంగా చూపినా 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించవచ్చు.